తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 11: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ నెల 17వ తేదీన నిర్వహించే తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు గాను ప్రభుత్వం జిల్లాకు ఒక ప్రముఖుడిని బుధవారం నియామకం చేసింది. వరంగల్ జిల్లాలో నిర్వహించే వేడుకలకు రాష్ట్ర రెవెన్యూ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరు కానున్నారు. వేడుకల్లో భాగంగా మంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు.



సమయం లేదు మత్స్యమా!

ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేప పిల్లల పంపిణీ ఇంకా చేపట్టలేదు. రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపినా ఇంకా ప్రక్రియ మొదలు కాకపోవడంతో మత్స్యకారుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఏటా చేప పిల్లలు పంపిణీ చేయడానికి ఏప్రిల్ నెలాఖరున టెండర్లు ప్రకటన విడుదల చేసి మే నెల రెండో వారంలో ఖరారు ప్రక్రియ పూర్తి చేసేవారు. అయితే సెప్టెంబరు నెల వచ్చినా చేపపిల్లల పంపిణీపై స్పష్టత రాలేదు. ఇప్పటికీ టెండర్ల ప్రక్రియ ఖరారు చేయకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. దీంతో చేప పిల్లల పంపిణీలో అసాధారణమైన జాప్యం జరుగుతోంది. ఇంకా ఆలస్యం జరిగితే ఈ యేడు చెరువుల్లో చేపల పెంపకం తగ్గిపోయే ప్రమాదం ఉందని, దిగుబడి తగ్గిపోతుందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- చేప పిల్లల పంపిణీలో తీవ్ర జాప్యం
- అదను దాటుతున్నా.. ఖరారుకాని టెండర్లు
- బిల్లులు చెల్లించకపోవడంతో ముందుకు రాని కాంట్రాక్టర్లు
- పంపిణీలో జాప్యంతో తగ్గనున్న చేపల ఉత్పత్తి
- ఆందోళనలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మత్స్యకారులు



హనుమకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చెరువుల్లో చేప పిల్లల పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. యేటా ఈపాటికి పంపిణీ జరిగేది. ఈ యేడు ఇంకా ప్రారంభం కాలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం యేటా జూలై రెండో వారం నుంచి చెరువుల్లోకి చేప పిల్లలను విడుదల చేసేది. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి గత ప్రభుత్వం ఉచితంగా చేప, రొయ్య పిల్లల పంపిణీ చేసింది. ఎనిమిదేళ్లుగా పైసా ఖర్చులేకుండా మత్స్యకారులు చెరువుల్లో ఎదిగిన చేపలను విక్రయించుకోవడం ద్వారా ఉపాధిపొందుతూ వచ్చారు. ఈసారి ప్రభుత్వం మారడంతో దీనిపై మొదట్లో సందిగ్ధం నెలకొన్నది.

ఖరారు కాని టెండర్లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8.54 కోట్ల చేప పిల్లలను విడుదల చేసేందుకు హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల మత్స్య శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో జూలై 10, 23 తేదీల్లో టెండర్లను పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో మళ్లీ ఆగస్టు 13 వరకు గడువు పెంచారు. కిందటిసారి ఉమ్మడి జిల్లాలో సరఫరా చేసిన చేప పిల్లలకు సంబంధించిన సుమారు రూ.7.18కోట్ల వరకు కాంట్రాక్టర్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు చెబుతున్నారు. మళ్లీ టెండర్‌లో పాల్గొనాలంటే టెండర్ ఫీజు, ఈఎండీ, చేప పిల్లల కొనుగోలు, రవాణా తదితర వాటికి పెట్టుబడి అవసరం. ప్రభుత్వం పాత బకాయిలు విడుదల చేసే వరకు టెండర్‌లో పాల్గొనకుండా రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టర్లు సిండికేట్ అయ్యారు.

ఆలస్యమైతే ఎదుగుదలపై ప్రభావం

చేప పిల్లల పంపిణీలో జాప్యం జరిగితే దాని ప్రభావం వాటి పెరుగదలపై పడుతుంది. సకాలంలో చెరువులు, ప్రాజెక్టులు, ఇతర జలవనరుల్లో చేప పిల్లలను విడుదల చేసినప్పుడు మత్స్యకారులు ఆశించిన దిగుబడిని పొందగలుగుతారు. కిలో సైజు చేప పెరగాలంటే కనీసం ఆరు నెలల సమయం పడుతుంది. జూలై, ఆగస్టు మాసంలో వదిలితే డిసెంబరు, జనవరి నుంచి చేపలు పట్టుకొని విక్రయించుకునే అవకాశం ఉంటుంది. సెప్టెంబరులో వదిలితే అవి కిలో సైజు ఎదగడానికి ఫిబ్రవరి వస్తుంది. ఇంకా పెరగాలంటే ఏప్రిల్, మే వచ్చేస్తుంది. ఎండల కారణంగా నీరు తగ్గి చేపలు చనిపోయే అవకాశం ఉంటుందని మత్స్యకారులు చెబుతున్నారు. మత్స్యకారులు పూర్తి నీటితో నిండిన చెరువుల్లో 45 రోజుల వయసుతో ఉండి 30-40 మి.మీ పొడవుగా ఉన్న చేపలను పెంచుతారు. ఏడాది మొత్తం నీరుండే ప్రాజెక్టులు, పెద్ద చెరువుల్లో 75 రోజులు వయసు కలిగిన 80-100 మి.మీ పొడవు చేపలు వదిలి పెంచుతారు. టెండర్ల నిర్వహణ ఆలస్యమైతే కాంట్రాక్టర్లు చేప పిల్లలను నాసిరకంగా పంపిణీ చేసే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. మత్స్యకారులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే చేప పిల్లల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని కోరుతున్నారు.

వేల మందికి ఉపాధి

చేప పిల్లల విడుదలతో వేల మంది మత్స్యకారుల కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది. ఉమ్మడి జిల్లాలో గంగపుత్రులతో పాటు ఇతర రైతులు కూడా చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు చేప పిల్లల విడుదలతో వీరి ఉపాధికి మార్గం ఏర్పడు తుంది. చేప పిల్లలను త్వరగా విడుదల చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు. ప్రస్తుతం వర్షాలతో మట్టినీరు ఉండడంతో ఆహార లభ్యత ఉంటుంది. నీరు తెలుపుగా మారాక ఆహార కొరత ఏర్పడుతుంది. ఆలస్యంగా వేయడంతో మార్చి నుంచి ఎండలతో నీరు ఇంకిపోవడంతో చేప ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడుతుంది.



నగదు బదిలీ పథకం

ఈ ఏడాది చేప పిల్లల పంపిణీ ఆలస్యమయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. చేపపిల్లల పంపిణీకి మరో 15-20 రోజులు పట్టవచ్చు. ఆ పాటికి సమయం దాటిపోతుంది. ప్రభుత్వం ద్వారా ఉచిత చేప పిల్లల పంపిణీపై మత్స్యకారులు ఆశలు వదులుకున్నారు. ఉచిత చేపపిల్లల పంపిణీ కోసం ఎదురుచూస్తూ కూర్చుంటే పుణ్యకాలం గడిచిపోయి చేపల ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాదం ఉందని గ్రహించిన మత్స్యకార సంఘాలు.. సొంతంగా డబ్బులు పెట్టి చేపపిల్లలను కొనుగోలు చేసి చెరువుల్లోకి వదులుతున్నాయి. ఇప్పటికే 60-70 శాతం చెరువుల్లో మత్స్యకార సంఘాలు బయట మార్కెట్‌లో కొన్న చేప పిల్లలను వదిలాయి. చేప పిల్లల పంపిణీలో ఆలస్యాన్ని దృష్టిలో పెట్టుకొని మత్స్యకారులే

మిగతా 8వ పేజీలో..

పది రోజుల్లో పంపిణీ

- నాగమణి, వరంగల్, హనుమకొండ జిల్లాల మత్స్యశాఖ అధికారి

"చేప పిల్లల పంపిణీకి సంబంధించిన టెండర్ల ప్రక్రియ ప్రస్తుతం పరిశీలనలో ఉంది. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం అన్ని ముందు జాగ్రత్తలు తీసుకుంటోంది. చెరువుల విస్తీర్ణాన్ని బట్టి చేపవిత్తనాల సేకరణ ఉంటుంది. చేపపిల్లల పంపిణీలో జాప్యం వల్ల చేపల ఎదుగుదల తగ్గిపోతుందనేది అపోహ మాత్రమే. జూన్, జులైలోనే చేపపిల్లలను వదిలామనుకుంటే భారీ వర్షాల వల్ల వరదలొస్తే కొట్టుకుపోయే ప్రమాదం కూడా ఉంటుంది కదా? చేపపిల్లల పంపిణీలో జాప్యం వల్ల నష్టమేమీ ఉండదు."

నాలుగు వేల చెరువులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వెయ్యి పెద్ద చెరువులు, 3వేల చిన్న చెరువులు, 189 రిజర్వాయర్లు ఉన్నాయి. 800 మత్స్యసహకార సంఘాలు, 150 మహిళా మత్స్యసహకార సంఘాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో అధికారికంగా సుమారు లక్ష మంది, అనధికారికంగా లక్షా 50మంది వరకు చేపలవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో రవ్వు, బొచ్చ, బంగారు తీగె, గడ్డిచాప, మెరిగ, బొమ్మె తదితర చేపలు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. ములుగు జిల్లాలోని రామన్న, లక్నవరం, గణపురం, భీంఘనపూర్ జనగామ జిల్లాలో స్టేషన్‌ఘనపూర్, గండిరామారావు, రాజవరం హనుమకొండ జిల్లాలో ధర్మసాగర్, చలివాగు తదితర రిజర్వాయర్లలో చేపల ఉత్పత్తి పెద్ద ఎత్తున జరుగుతుంది. వీటిలో రొయ్యల పెంపకం కూడా పెద్ద ఎత్తున సాగుతోంది. ఉమ్మడి వరంగల్‌లో సుమారు లక్ష టన్నుల చేపల ఉత్పత్తి జరుగుతుందని అంచనా. ఉత్పత్తి అయిన చేపల్లో స్థానికంగా వాడకం పోనూ హైదరాబాద్, కలకత్తా, మహారాష్ట్రలోని నాందేడు తదితర ప్రాంతాలకు ఎగుమతి కూడా అవుతాయి.



నర్సంపేటలో బీజేపీ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న గరికపాటి మోహన్‌రావు, అరూరి రమేశ్, సీతారాంనాయక్

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

- రాజ్యసభ మాజీ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు

8



వీసీ నియామకం ఎన్నడో?

- కాళోజీ హెల్త్‌వర్సిటీకి వైస్ చాన్స్‌లర్ భర్తీపై ఎడతెగని నిర్లక్ష్యం
- పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానించి.. మరిచిపోయిన వైద్యశాఖ
- 35 మంది నుంచి అందిన దరఖాస్తులు
- రెండు నెలలు గడిచినా పరిశీలించని కమిటీ
- మూడు పేర్లని సీఎంకు పంపే ప్రక్రియను మరిచిన వైనం
- రూల్స్‌కు విరుద్ధంగా పదేళ్లుగా వీసీ బాధ్యతల్లో ఒకే వ్యక్తి
- గత ప్రభుత్వంతో ఉన్న సాన్నిహిత్యంతోనే కొనసాగింపని ప్రచారం
- పలు అవకతవకలకు వర్సిటీ నిలయంగా మారిందని ఆరోపణలు

7

కీలక పోస్టుల్లో రిటైర్డు ఉద్యోగులకు కీలక బాధ్యతలు అప్పగించడం.. పీజీ పరీక్షల ఫలితాల్లో అవకతవకలు.. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ అంచనా వ్యయం భారీగా పెంపు.. నర్సింగ్ కోర్సు నిర్వహణలో విఫలం.. తదితర ఆరోపణలు కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ కీర్తిప్రతిష్టలకు మాయని మచ్చల్లా మిగిలాయి. వీటంతటికీ పదేళ్లు గా ఒకే వ్యక్తి వీసీగా కొనసాగడమే కారణమని.. త్వరలోనే ఆ స్థానంలో కొత్త వ్యక్తిని నియమిస్తారన్న ప్రచారం జరిగింది. అందుకు అనుగుణంగా వైద్యశాఖ ఈ ఏడాది జూన్‌లో అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించగా 35మంది దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో ఇక కొత్త వీసీ వస్తారు.. వర్సిటీ పరిస్థితి మారుతుందని అంతా భావించారు. కానీ ఎడతెగని నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. దరఖాస్తులు స్వీకరించి రెండు నెలలైనా వాటిని కమిటీ పరిశీలించకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తప్ప వీసీ నియామకం అంశంలో అడుగులు ముందుకు పడవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి, వరంగల్ ప్రతినిధి

భారీ వర్షాల నష్టంపై ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- ఇంజనీరింగ్ అధికారులతో మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 11: ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల జరిగిన నష్టంపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే సమర్పించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. బుధవారం వరంగల్‌లోని బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో వరద నష్టంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. బల్దియా వ్యాప్తంగా మంచినీటి సరఫరా తదితర అంశాలపై డివిజన్ల వారీగా అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. వర్షాల కారణంగా ఇళ్లు, రోడ్లు, మంచినీటి పైప్‌లైన్లు, డ్రైనేజీల నష్టంపై ప్రతిపాదనలు పంపించాలన్నారు. అన్ని డివిజన్లకు సమాంతరంగా మంచినీటిని విడుదల చేయాలని, అండర్ రైల్వేగేటు, రాంపూర్, ఏనుమాముల ప్రాంతాల వద్ద సంపు నిర్మాణాలకు వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. నీటి సరఫరా జరిగే సమయంలో కరెంటు కోతలు లేకుండా చూడాలన్నారు. ధర్మసాగర్ ఫిల్టర్‌బెడ్‌లో ప్రత్యేకంగా జనరేటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, ఈఈలు శ్రీనివాస్, మహేందర్, డీఈలు సంతోష్‌బాబు, సారంగం, కృష్ణమూర్తి, రవికిరణ్, రంగరాజు, శివానంద్, శ్యాంమోహన్‌రాజ్, కుమార్, ఏఈలు పాల్గొన్నారు.



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న గుండు సుధారాణి

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్

ఖిలావరంగల్, సెప్టెంబరు 11: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయడంతోపాటు పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఖిలావరంగల్‌లోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భోగేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతీ ప్రాథమిక పాఠశాలకు, తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలన్నారు. అన్ని ప్రాథమిక పాఠశాలలకు పీఎస్‌హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేసి, డీఈడీతో పాటు బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు కూడా పదోన్నతులు కల్పించాలన్నారు. ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు పూర్తి చేసి 010 ద్వారా వేతనాలను చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. కేజీబీవీ, యూఆర్ఎస్ ఉపాధ్యాయులు, సిబ్బందికి కనీస మూల వేతనం చెల్లించాలని, మహిళా ఉపాధ్యాయినుల మాదిరిగా పురుషులకు 27 సెలవులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు జె.స్వామి, పూర్వ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఊత్కూరి అశోక్, మానుపాటి వెంకట్, ఖిలావరంగల్ మండల అధ్యక్షుడు బెల్లంకొండ పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆరెల్లి బుచ్చయ్య పాఠశాలలో మాట్లాడుతున్న భోగేశ్వర్


గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్టు

- వరంగల్ రైల్వేస్టేషన్‌లో 17.425 కిలోలు స్వాధీనం

గిర్మాజీపేట, సెప్టెంబరు 11: భువనేశ్వర్ నుంచి మన్మాడుకు గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను వరంగల్ రైల్వేస్టేషన్‌లో అరెస్టు చేసి 17.425 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ తెలిపారు. బుధవారం వరంగల్ జీఆర్‌పీలో ఆర్‌పీఎఫ్ సీఐ టీఎస్ఆర్.కృష్ణతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సురేందర్ నిందితుల అరెస్టు చూపి వివరాలను వెల్లడించారు. మహారాష్ట్ర పూణేకు చెందిన సోహైల్ షకీర్ ఇనామ్‌దార్, అఫ్తాబ్ షమీర్‌షేక్, సాకిబ్ జిలానిషేక్, అభిషేక్ తిక్కయ్య రెడ్డి అనే యువకులు ఆటోడ్రైవర్, వాహనాల కన్సల్టెంట్లుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. అయితే గంజాయి విక్రయిస్తూ అధిక డబ్బు సంపాదించాలనే ఆశతో వీరు నాలుగు రోజుల క్రితం భువనేశ్వర్‌కు వెళ్లారన్నారు. అక్కడ 17.425 కిలోల ఎండు గంజాయి కొనుగోలు చేసి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో మంగళవారం వరంగల్‌కు చేరుకున్నారని సీఐ పేర్కొన్నారు. అదే రైలులో వెళితే పోలీసులు పట్టుకుంటారని, మరో రైలులో మన్మాడుకు పోవచ్చని భావించి వరంగల్ రైల్వేస్టేషన్‌లో దిగి ప్లాట్‌ఫారం-2లో నలుగురు ఉన్నారన్నారు. మంగళవారం సాయంత్రం ఆర్‌పీఎఫ్ ఎస్సై జి.వెంకటేశ్వర్లు, జీఆర్‌పీ ఎస్సై మొహినుద్దీన్‌లతో కూడిన ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ బృందం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తుండగా ప్లాట్‌ఫారం-2పై అనుమానాస్పదంగా కనిపించిన నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ చెప్పారు. వారి వద్ద ఉన్న షోల్డర్ బ్యాగులను తనిఖీ చేయగా 17.425 కిలోల ఎండు గంజాయి లభించిందన్నారు. వారిని జీఆర్‌పీకి తరలించి విచారించగా భువనేశ్వర్‌లో కొనుగోలు చేసిన గంజాయిని మన్మాడులో విక్రయించేందుకు వెళ్తున్నట్లుగా అంగీకరించారని తెలిపారు. నలుగురిని అరెస్టు చేసి గంజాయితో సహ బుధవారం కాజీపేట రైల్వే కోర్టు ద్వారా రిమాండ్‌కు పంపినట్లు సీఐ పి.సురేందర్ పేర్కొన్నారు. ఈ గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.4,35,625 ఉంటుందన్నారు. సమావేశంలో ఆర్‌పీఎఫ్ సీఐ టీఎస్ఆర్.కృష్ణ, ఎస్సై జి.వెంకటేశ్వర్లు, జీఆర్‌పీ ఎస్సై మొహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



అరెస్టు చూపి వివరాలు వెల్లడిస్తున్న జీఆర్‌పీ సీఐ పి.సురేందర్



18 నుంచి డీఎల్ఈడీ పరీక్షలు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 11: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ పరీక్షలు ఈ నెల 18 నుంచి 24 వరకు జరుగుతాయని డీఈవో డి.వాసంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. సంబంధిత వెబ్ పోర్టల్ నుంచి విద్యార్థులు వారి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను అనుమతించరని, పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని ఆమె పేర్కొన్నారు.

అడహక్ ప్రమోషన్‌లను క్రమబద్ధీకరించాలి

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 11: విద్యుత్ సంస్థల్లో టీవోవో- 954, ఎస్‌వోవో- 37 ఉత్తర్వులను వెంటనే రద్దు చేసి ఇటీవల కల్పించిన అడహక్ ప్రమోషన్‌లను ఆర్‌టిఆర్ (రూల్ ఆఫ్ రిజర్వేషన్) రూల్స్ ప్రకారం క్రమబద్ధీకరించాలని టీజీ ఎస్పీడీసీఎల్ ఎస్సీ, ఎస్టీ జాక్ నాయకుడు డీఈ ఆనందం డిమాండ్ చేశారు. పదోన్నతుల్లో పాతపద్ధతిని యథావిధిగా అమలు చేయాలని నిరసిస్తూ హనుమకొండ నక్కలగుట్టలోని కార్పొరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందం మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో టీవోవో- 954, ఎస్‌వోవో-35 ఉత్తర్వులు జారీ చేసి పదోన్నతుల్లో మెరిట్ కమ్ సీనియారిటీ అంశానికి తెరలేపి ఎస్సీ, ఎస్టీ పదోన్నతుల్లో రిజర్వేషన్‌లకు అడ్డంకులు సృష్టిస్తూ విద్యుత్‌శాఖలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ చర్య పూర్తిగా రాజ్యాంగానికి, రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన జీవోలకు వ్యతిరేకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ అసోసియేషన్ కంపెనీ ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, ఎస్టీ అసోయేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీరాంనాయక్, ఉద్యోగులు రమేశ్, ప్రభావతి, నర్సింహారావు, దుర్గం మల్లేశం, మొగిలయ్య, నందారాథోడ్, రమేశ్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పులిపిరికి అరుదైన చికిత్స

ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు


పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

వరంగల్ జిల్లా, సెప్టెంబర్ 11: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కలగుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండ నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 11, 12, 13 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. గురు, శుక్రవారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.


హైకోర్టు తీర్పు ఆధారంగానే కులగణన ప్రారంభించాలి


వడ్డెపల్లి, సెప్టెంబరు 11: హైకోర్టు తీర్పు ఆధారంగానే కులగణన ప్రారంభించాలని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ కోరారు. బుధవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ జవహర్ కాలనీలో నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించి రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణనపై రోడ్ మ్యాప్ ప్రకటించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, రాష్ట్ర, జిల్లా నాయకులు తమ్మల శోభారాణి, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్ పాల్గొన్నారు.


మండలి ప్రతిపక్ష నేతగా సిరికొండ

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 11: మండలి ప్రతిపక్ష నేతగా మాజీ స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి నియమితులయ్యారు. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. జూలై 25న మండలిలో బీఆర్ఎస్ పక్షనేతగా మధుసూదనాచారిని ఆపార్టీ అధినేత కేసీఆర్ నియమించారు. ఆయనను ప్రతిపక్ష నేతగా గుర్తించాలని అసెంబ్లీ కార్యదర్శికి లేఖ అందజేయగా దానిపై బుధవారం ఆమోదముద్రపడింది.















వీసీ నియామకమెన్నడో?

కాళోజీ హెల్త్‌వర్సిటీకి వైస్ చాన్స్‌లర్ భర్తీపై ఎడతెగని నిర్లక్ష్యం

నిబంధనలకు విరుద్ధంగా పదేళ్లుగా వీసీ బాధ్యతల్లో ఒకే వ్యక్తి



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పోస్టు భర్తీపై ఎడతెగని నిర్లక్ష్యం ఆవహించింది. కొత్త వీసీ నియామకంపై వైద్యశాఖలో స్పష్టత కరువైంది. వర్సిటీ ఏర్పడిన నాటి నుంచి పదేళ్లుగా ఒకే ఒక వ్యక్తిని వీసీని కొనసాగిస్తుండగా.. కొత్త వీసీ కోసం దరఖాస్తులు స్వీకరించి రెండు నెలలైనా వాటిని పరిశీలన చేయకపోవడం పట్ల వైద్యశాఖ వర్గాల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుదీర్ఘకాలం పాటు వీసీగా పని చేయడంతో పాటు కీలక పోస్టుల్లో రిటైర్డు ఉద్యోగులకు కీలక బాధ్యతలు అప్పగించటం, పీజీ పరీక్షల ఫలితాల్లో అవకతవకలు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ అంచనా వ్యయం భారీగా పెంపు, నర్సింగ్ కోర్సు నిర్వహణలో విఫలం తదితర ఆరోపణల నేపథ్యంలో వీసీని తొలగిస్తారనే ప్రచారం జరుగుతోంది. అయితే నోటిఫికేషన్ ఇచ్చి కొత్త వీసీని ఎంపిక చేయకపోవటం ఏంటనేది వైద్యశాఖలో చర్చనీయాంశంగా మారింది.

పదేళ్లుగా ఒకే ఒక్క వైస్‌చాన్సలర్

కాళోజీ హెల్త్ యూనివర్సిటీలో పదేళ్లుగా ఒకే ఒక్కరు వైస్ చాన్సలర్‌గా కొనసాగుతున్నారు. 2015 సెప్టెంబరు 26న హెల్త్ వైస్‌చాన్సలర్‌గా డాక్టర్ బి.కరుణాకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. 31 డిసెంబరు 2019నాటికి ఆయన పదవీకాలం ముగిసింది. అయితే యూనివర్సిటీ నిబంధనల ప్రకారం మరో ఆరు నెలల వరకు కొత్త వీసీ వచ్చేవరకు పదవిలో కొనసాగే అవకాశం ఉంది. ఆ గడువు కూడా ముగిసిపోయింది. సుమారు పది సంవత్సరాలుగా ఒక్కరే వీసీ సీటును వదలటం లేదనే విమర్శలు ఉన్నాయి. గత ప్రభుత్వంలోని పెద్దల సహకారంలో సుదీర్ఘ కాలంగా వీసీ కుర్చీలో సెటిల్ అయ్యారనే ప్రచారం జరుగుతోంది. దేశ చరిత్రలోనే హెల్త్ యూనివర్సిటీకి ఒక్కరే వీసీగా ఇంతకాలం పని చేసిన దాఖాలాలు ఎక్కడ లేవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో మార్చి 23న అన్ని యూనివర్సిటీలకు వీసీ పదవీకాలం పూర్తి కావటంతో ఐఏఎస్‌లను ఇన్‌చార్జ్ వీసీలుగా నియమించింది. అయితే పదేళ్లుగా వీసీగా బాధ్యతలు నిర్వహిస్తున్న కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీని మాత్రం టచ్ చేయకపోవటం వైద్య ఆరోగ్యశాఖలో చర్చనీయాంశంగా మారింది.

సెర్చ్ కమిటీ పరిశీలించేదెప్పుడో?

కాళోజీ హెల్త్ వర్సిటీ వైస్ చాన్సలర్ పదవీకాలం ఎప్పుడో పూర్తయింది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని పెద్దలతో సత్సంబంధాలు ఉండటంతో వీసీని మార్చకుండా కొనసాగించారనే ప్రచారం ఉంది. దీంతో పదేళ్లుగా హెల్త్ వర్సిటీ కుర్చీని వదలకుండా అతుక్కుపోయారనే విమర్శలున్నాయి. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత యూనివర్సిటీల బలోపేతంపై దృష్టిపెట్టింది. అందులో భాగంగా తెలంగాణలో ఉన్న అన్ని యూనివర్సిటీలకు వీసీల నియామకం కోసం సెర్చ్ కమిటీలను నియమించింది. తాత్కాలికంగా ఐఏఎస్‌లను ఇన్‌చార్జ్ వీసీలుగా నియమించింది. అలాగే కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ నియామకం కోసం జూన్ 5వ తేదీ నుంచి 22వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానించింది. రెండేళ్ల పాటు డీన్‌గా లేదా కనీసం పదేళ్లు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పని చేసి, 67ఏళ్ల లోపు వయస్సున్న వారు దరఖాస్తు చేసుకోవాలని వైద్యఆరోగ్యశాఖ ఆహ్వానించింది. అయితే నోటిఫికేషన్‌లో డీన్‌గా రెండేళ్ల పాటు పని చేసి ఉండాలని సూచించటం యూజీసీ నిబంధనలకు విరుద్ధమని వైద్యులు వాదించటంతో తొలుత ఇచ్చిన నోటిఫికేషన్‌ను సవరించి జూలై 6వ తేదీ వరకు దరఖాస్తులకు ఆహ్వానించారు. వరంగల్‌కు చెందిన పలువురు వైద్యులు కూడా వీసీ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే గడువులోపు 35కి పైగా దరఖాస్తులు వచ్చినట్టు సమాచారం. నిబంధనల ప్రకారం ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీ వీసీ పోస్టు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించాల్సి ఉంటుంది. దరఖాస్తులు పరిశీలించిన తరువాత ముగ్గురి పేర్లను ప్రభుత్వానికి పంపించాలి. సెర్చ్ కమిటీ పంపిన మూడు పేర్లను సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించి తుది పేరును గవర్నర్ ఫైనల్ చేసి వీసీని నియమిస్తారు. అయితే జూలై 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి రెండు నెలలు గడిచినా ఇప్పటి వరకు సెర్చ్ కమిటీ వీసీ పోస్టుకు ముగ్గురి పేర్లను ఎంపిక చేసి ప్రభుత్వానికి పంపించకపోవడానికి కారణాలేంటనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది.

స్థానికత అంశంపై కోర్టులో కేసులు ఉండటంతో కొంత ఆలస్యమవుతోంది. వీటితో పాటు బీఎస్సీ నర్సింగ్ కోర్సులకు కూడా కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కొత్త వీసీ నియామకంపై వైద్యఆరోగ్యశాఖ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

కొత్త వీసీ కోసం వెయిటింగ్..

కాళోజీ హెల్త్ వర్సిటీలో పదేళ్లుగా ఒక్కరే వీసీగా బాధ్యతలు నిర్వహిస్తుండటంతో విశ్వవిద్యాలయం పాలన గాడి తప్పిందన్న విమర్శలున్నాయి. వీసీ యూనివర్సిటీలో కంటే హైదరాబాద్‌కే ఎక్కువ పరిమితం అవుతున్నారనే ఆరోపణలున్నాయి. అంతేకాకుండా గత ప్రభుత్వం వరంగల్ జైలు భూమి సర్వే నెంబరు 31,32లోని 2,75,759 గజాల స్థలాన్ని (56ఎకరాలు) తాకట్టు పెట్టి వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కోసం హైదరాబాద్‌లోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శాఖ నుంచి రూ.1,173కోట్ల రుణం తీసుకుంది. ఈ విషయమై ఆగ్రహంగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించారు. అయితే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కోసం ఏర్పాటు చేసిన కమిటీలో వీసీ కూడా సభ్యుడిగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. జైలు స్థలం తాకట్టులో కమిటీ సభ్యులు, వైద్యులు, ఆర్‌అండ్‌బీ అధికారుల పాత్రపై విజిలెన్స్ విచారణ చేపట్టింది. అలాగే 2022లో పీజీ సీట్ల కేటాయింపుల్లో గోల్‌మాల్ జరిగింది. దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. అయితే రెండేళ్లుగా విజిలెన్స్ విచారణను ముందుకు సాగినివ్వటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రెగ్యులర్ ఉద్యోగుల నియామకంపై దృష్టిపెట్టకపోవటంతో పాటు తన సన్నిహితులను కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాల్లో నియమించుకున్నారనే ఆరోపణలను వీసీ ఎదుర్కొంటున్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు హెల్త్ యూనివర్సిటీని పునారవాస కేంద్రంగా మార్చారని, అంతేకాకుండా బీఎస్సీ నర్సింగ్ కోర్సును సక్రమంగా నిర్వహించటంలో వైఫల్యం చెందారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో మగవారికి కూడా అవకాశం కల్పించాలని 2007లోనే ప్రభుత్వం ఆదేశించింది.

ప్రస్తుతం ఆడవారికి మాత్రమే నర్సింగ్‌లో అడ్మిషన్లు ఉండగా, మగవారు కూడా నర్సింగ్ కోర్సుపై ఆసక్తితో ఉన్నారు. దీనిపై పలువురు కోర్టుకు వెళ్లినప్పటికి మగవారికి హాస్టల్ వసతి లేదనే సాకుతో ఇన్నాళ్లు ప్రవేశాలు కల్పించటం లేదు. కనీసం డే స్కాలర్‌గానైనా అవకాశమివ్వాలని మగవారు కోరుతున్నా హెల్త్‌వర్సిటీ పట్టించుకోవటం లేదు. దీనికి వీసీ నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలున్నాయి. బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో గతేడాది అడ్మిషన్ల విషయంలో గందర గోళంగా వ్యవహరించారని, ఈఏడాది కూడా నర్సింగ్ అడ్మిషన్లపై స్పష్టత ఇవ్వటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మొత్తానికి పదేళ్లుగా అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న పాత వీసీని మార్చి కొత్త వీసీని ఎప్పుడు నియమిస్తారనే చర్చ వైద్య ఆరోగ్య శాఖలో జోరుగా జరుగుతున్నా ప్రభుత్వం ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుందా అని ఎదురుచూస్తున్నారు.



బ్యారేజీలో బోట్‌పై ఏడీసీపీ సర్వే నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు

మేడిగడ్డ బ్యారేజీలో ఏడీసీపీ సర్వే

- ప్రవాహ తీరును రికార్డు చేయనున్న శాస్త్రవేత్తలు
- మరో మూడు రోజులు కొనసాగనున్న అధ్యయనం

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 11 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీలో నీటి ప్రవాహ వేగాన్ని తెలుసుకునేందుకు అకాస్టిక్ డాప్లర్ కరెంట్ ప్రొఫైలర్ (ఏడీసీపీ) సర్వే బుధవారం నిర్వహించారు. పూణేకు చెందిన సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్లూపీఆర్ఎస్) శాస్త్రవేత్త సంపత్ కుమార్ నేతృత్వంలోని నలుగురు బృందం సభ్యులు పవర్ బోట్‌లో తిరుగుతూ పరిశీలించారు. బ్యారేజీకి ఎగువ, దిగువ ప్రవాహ బ్లాకుల్లో ప్రవాహ తీవ్రతను అధ్యయనం చేశారు. ఇది ఇంకా రెండు, మూడు రోజులుగా కొనసాగనుంది. గోదావరిలో ప్రవాహ తీవ్రత ఎక్కడ ఏవిధంగా ఉందో శాస్త్రవేత్తలు గుర్తించనున్నారు.దీన్ని బట్టి ప్రవాహ తీవ్రతకు బ్యారేజీ సామర్థ్యం సరిపోతుందా.. లేదా? అనేది నిర్ధారణకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. రెండు వారాల క్రితమే ఈసర్వే నిర్వహించాల్సి ఉండగా పవర్ బోట్ అందుబాటులో లేకపోవడంతో ఆలస్యమైనట్లు సమాచారం. నాటు పడవలు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రవాహ తీవ్రత ఎక్కువగా ఉండటంతో సర్వేను వాయిదా వేశారు. పవర్ బోట్ అందుబాటులోకి రావడంతో సర్వేను బుధవారం ప్రారంభించారు. సీడబ్ల్యూపీఆర్ఎస్ శాస్త్రవేత్తల వెంట ఈఈ తిరుపతి రావు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

- మార్కెటింగ్ శాఖ జేడీ ఉప్పుల శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ ఉప్పుల శ్రీనివాస్

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 11: మార్కెట్ ఫీజు వసూళ్లలో నిర్లక్ష్యం వహించవద్దని మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్ అన్నారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీల కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. మరికొద్ది రోజుల్లో కాటన్ సీజన్ ప్రారంభం కాబోతున్నందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. యార్డులలో మౌలిక సదుపాయలు కల్పించి తాగు నీరు, లైటింగ్, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేయింగ్ మిషన్స్ సరి చేయించుకోవాలని, ఖరీదుదారుల నుంచి ప్రతీ నెల కొనుగోలు నివేదికలు తీసుకుంటూ మార్కెట్ ఫీజు ఎప్పటికప్పుడు వసూలు చేయాలని ఆదేశించారు. మార్కెట్లను ఆకస్మిక తనిఖీలు చేసినప్పుడు ఏదైనా తేడా వస్తే దానికి మీరే బాధ్యత వహించాల్సి వస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవో సురేఖ, ఏనుమాముల మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మల, ఉమ్మడివరంగల్ జిల్లాలోని వ్యవసాయ మార్కెట్‌ల కార్యదర్శులు పాల్గొన్నారు.

'గోమయం' గణపయ్య..

- ఆవుపేడ, గోపంచకం, పసుపుతో విగ్రహం
- నవరాత్రుల్లో ఎనిమిదేళ్లుగా ఇదే ప్రత్యేకత



గోమయం వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న శ్రీమహాలక్ష్మీగణపతి సేవా ట్రస్టు బాధ్యులు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 11: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీమహాలక్ష్మీ గణపతి సేవాట్రస్టు ఆధ్వర్యంలో తొలుత మట్టివిగ్రహాలను పూజించారు. ఆ తర్వాత మరో అడుగు ముందుకేసి.. ఎనిమిదేళ్లుగా 'గోమయం' వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ఎస్వీ. నాగేశ్వర్‌రావు, సోమ శ్రీనివాస్, శ్రీరంగం రామారావు, సోమ రాంబాబు ఆధ్వర్యంలో 2000 సంవత్సరంలో శ్రీమహాలక్ష్మీ గణపతి సేవా ట్రస్టును స్థాపించారు. పర్యావరణ పరిరక్షణే నినాదంగా ఈ ట్రస్టు వారు గోమయం (ఆవుపేడ), గోపంచకం, చింతగింజల పొడి, వేపాకు పేస్టు, పసుపుతో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో తయారు చేసిన గోమయం విగ్రహాన్ని కొనుగోలు చేసి తీసుకొచ్చి మహబూబాబాద్‌లో ప్రతిష్ఠించి నవరాత్రులు పూజలు చేస్తున్నారు. ఈ గోమయం విగ్రహం ద్వారా పర్యావరణానికి మేలుజరుగుతుందని, చెరువులో నిమజ్జనం చేశాక త్వరితగతిన కరిగిపోవడంతో పాటు ఆవుపేడ, గోపంచకం, వేపాకు పేస్ట్, పసుపు, చింతగింజల పొడి నీటిలో కలిసి క్రిమికీటాకాలు నశించిపోతాయని పర్యావరణ నిపుణులు, ప్రేమికులు చెబుతున్నారు. అంతేకాదు ఈ వినాయక విగ్రహం వద్ద నిత్యం కాళేశ్వరం నుంచి ప్రత్యేకంగా తీసుకవచ్చిన గంగాజలంతో పాటు 21రకాల అభిషేకాలు నిర్వహిస్తున్నారు.

తేలుతున్న కబ్జాల లెక్క

పకడ్బందీగా కేయూ భూముల సర్వే

- రెండో రోజు జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ భూ సర్వే
- కూల్చివేతలకు సిద్ధమవుతున్న అధికారులు
- వర్సిటీ భూ కబ్జాదారుల గుండెల్లో రైళ్లు



బీసీ కాలనీలోని రోడ్డు వద్ద మార్కింగ్ చేస్తున్న అధికారులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 11: కాకతీయ యూనివర్సిటీ భూ కబ్జాలు, ఆక్రమణలపై రోజు రోజుకూ కొత్త విషయాలు బహిర్గతమవుతాయి. రెండు రోజులుగా వర్సిటీలోని భూ కబ్జాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ, మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు బృందం నేతృత్వంలో పకడ్బందీగా సర్వేలకు దిగారు. ఈ సర్వేతో గతంలో వర్సిటీ అధికారులు చేసిన డిజిటల్ సర్వే, గూగుల్ మ్యాపులను మించి అధికంగా వర్సిటీ భూములు కబ్జాలకు గురైనట్లు తాజాగా చేపట్టిన సర్వేలతో రూఢీ అవుతోంది. దీంతో కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఇన్ని రోజులు వర్సిటీ భూమిని దర్జాగా అనుభవిస్తున్న కబ్జాదారులు.. ఇప్పటి తాజా సర్వేలతో బెంబేలెత్తుతున్నారు.

బీసీ కాలనీలో..

వర్సిటీ క్యాంపస్‌లోని న్యూ పీజీ బాయ్స్ హాస్టల్ పక్కన 229 సర్వేనెంబర్‌లో బుధవారం అధికారుల బృందం సర్వే నిర్వహించారు. ఇందులో బీసీకాలనీలో 30మంది ఇళ్లు వర్సిటీకి చెందిన భూమిల్లోకి వచ్చినట్లు స్పష్టత వస్తోంది. వర్సిటీ భూములను గుర్తించి ఇళ్లకు మార్కింగ్ చేసి కూల్చివేతలకు జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ సన్నద్ధం అవుతోంది. తాజా సర్వేతో బీసీ కాలనీలోని అంతర్గత రోడ్డుతో పాటు డెడ్ ఎండ్ సైతం వర్సిటీ భూమిలోనే ఉందని స్పష్టతరాగా, వెంటనే అధికారులు ఆయా స్థలాల్లో అధికారులు మార్కింగ్ చేశారు. అలాగే బీసీకాలనీలోని రోడ్డు సైతం వర్సిటీ భూమిలో ఉండటంతో ఏంచేయాలనే ఆలోచనలో పడ్డారు. సర్వే అనంతరం హనుమకొండ రెవెన్యూ సర్వేయర్ రాజేశ్ నేతృత్వంలో మార్కింగ్ చేసి భూ పంచనామా చేశారు. తర్వాత కూల్చి వేతలకు చేపడుతామని అధికారులు చెబుతున్నారు. శుక్రవా రం నుంచి 214లో సర్వే నెంబర్‌లో సర్వే చేపట్టనున్నారు. అంతకుముందే అయా స్థలాల్లో కబ్జాలు, ఆక్రమణలకు పా ల్పడ్డ వారికి నోటీసులు జారీ చేస్తామని మనిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు. వీటితోపాటు వర్సిటీలో ని మరో 6 సర్వే నెంబర్లలోనూ భూసర్వే చేపట్టిన తర్వాత వర్సిటీ భూమిపై పూర్తి స్పష్టత వస్తుందని జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ భావిస్తోంది.

వర్సిటీ మాజీలకు బిగుస్తున్న ఉచ్చు

కాకతీయ యూనివర్సిటీలో తాజా పరిణామాలను గమనిస్తే వర్సిటీ తాజా మాజీల చుట్టూ ఉచ్చు బిగుస్తోందని తెలుస్తోంది. అప్పటి బీఆర్ఎస్ అధికార పార్టీ ఎమ్మెల్సీ, ఇప్పటి ఎమ్మెల్యే ప్రోద్బలంతో తాజా మాజీలు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. తామేమి చేసినా ఏం కాదనే అహంకారంతో వ్యవహరించారనే చర్చ సాగుతోంది. అలాగే వర్సిటీ అధ్యాపకుల సంఘం (అకూట్) జనరల్ సెక్రెటరీ డాక్టర్ మామిడాల ఇస్తారీ, ఇతర విద్యార్థి సంఘాల నేతలు వర్సిటీలో జరిగిన అవినీతి అక్రమణలు, అధికార దుర్వినియోగంపై స్పష్టమైన ఆధారాలతో రాష్ట్రప్రభుత్వానికి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖాధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అవినీతి ఆరోపణలతోపాటు ఇతర విషయాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను విచారణకు ఆదేశించారు. దీంతో తాజా మాజీ వీసీపై వచ్చిన భూ కబ్జాలు, కేయూలో పీహెచ్‌డీ అడ్మిషన్లు అక్రమాలు, అడ్జంట్ ప్రొఫెసర్ల నియామకాలు, న్యాక్ అభివృద్ధి పనుల పేరుతో అందినకాడిన దోచుకున్న తీరు, తెలుగు తది తర విభాగాల్లో అక్రమంగా పార్టుటైమ్ అధ్యాపకుల నియామకాలు, తనకు అనుకూలమైన డీన్లు, ఇతర ఏ ఆర్‌లను ప్రధాన విభాగాల్లో నియమించుకుని డబ్బుల వసూళ్లకు పాల్పడిన తీరుపై విజిలెన్స్ డేగకన్నును వే సింది. వర్సిటీలోని ఆడిట్ కార్యాలయంలోని అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఏసీబీ అధికారులు హాస్టల్ కాంట్రాక్టర్ వద్ద నుంచి డబ్బుల వసూళ్లకు పాల్పడగా పట్టుకున్నారు. అప్పట్లో ఈ విషయంలో వర్సిటీతోపాటు రాష్ట్ర వ్యాప్తం గా సంచలనంగా మారింది.

వీటన్నింటితోపాటు ఓ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కబ్జాల స్థలంలో ఇల్లు నిర్మించుకోవడమే కాకుండా, అత్యున్నత పాలక మండలి నేతృత్వం వహించిన భూకమిటీలోనూ పనిచేసి తన ప్రాబల్యాన్ని చూపించారనే ఫిర్యాదులున్నాయి. వీటన్నింటినీ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ అనిల్‌కుమార్, ఎస్సై రాజేశ్ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టారు. వర్సిటీ నిబంధనలు ఏమి చెబుతున్నాయి..? రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు ఎలా ఉన్నాయి..? వర్సిటీలో ఏమి జరిగింది? ఏ పనులు నిబంధనలకు విరుద్ధంగా చేశారనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అడ్జంట్ ప్రొఫెసర్ల నియామకాలపై వచ్చిన ఫిర్యాదులపై ఇప్పటికే విజిలెన్స్ అధికారులకు అడ్జంట్ ఫ్యాకల్టీగా పనిచేసిన ప్రొఫెసర్లంతా ప్రత్యేకంగా విజిలెన్స్ అధికారులను కలిసి తమ వాదనలతో కూడిన అఫిడవిట్లు సమర్పించారు.

ఒక్కొక్క ఆరోపణలు రోజు రోజుకూ నిజ మని రూఢీ అవుతుండంగా, వర్సిటీలోని అక్రమాలకు బాధ్యులైన మాజీ బాస్‌లకు ఉచ్చు బిగుస్తోందనే విషయం బహిరంగ చర్చకు దారి తీస్తోంది. వర్సిటీ భూ కబ్జాలతో పాటు ఇతర అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగం తదితర వివాదాస్పద అంశాలన్నీ తాజాగా వర్సిటీలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

నెహ్రూసెంటర్ (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 11 : మహబూబాబాద్ మెడికల్ కళాశాలలో ఖాళీగాఉన్న కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఆధ్యాపక పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లకావత్ వెంకట్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న ప్రభుత్వ వైద్య కళాశాలలో వాక్‌ఇన్ ఇంటర్వ్యూ పద్ధతిన పోస్టులను భర్తీ చేస్తారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ 5 పోస్టులు, అసోసియేట్ ప్రొఫెసర్ 7, అసిస్టెంట్ ప్రొఫెసర్ 19, సీనియర్ రెసిడెన్స్ 49, ట్యూటర్ 26 పోస్టులు ఉన్నాయన్నారు. అసక్తి కలిగిన అభ్యర్థులు సంబంధిత అర్హత సర్టిఫికెట్లు, కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, జిరాక్స్, ఒరిజినల్స్ తీసుకుని ప్రభుత్వ వైద్య కళాశాల మహబూబాబాద్‌కు హాజరు కావాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 69 ఏళ్ల కలిగి ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాల వెబ్‌సైట్ http://gmcmahabubabad.org. నోటిఫికేషన్ దరఖాస్తులు పొందవచ్చని తెలిపారు

వరంగల్ జిల్లా కోర్టు గవర్నమెంట్ ప్లీడర్‌గా రవి



వరంగల్ లీగల్, సెప్టెంబరు 11: వరంగల్ జిల్లా ప్రధాన కోర్టు ప్రభుత్వ న్యాయవాది (గవర్నమెంట్ ప్లీడర్)గా న్యాయవాది పోతరాజు రవిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పదవిలో ఆయన ఆరు నెలల పాటు కొనసాగుతారని ఉత్తర్వులో పేర్కొన్నారు. 20 ఏళ్ల నుంచి జిల్లాకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్టు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 11: ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మండిబజార్ వద్ద పోలీసులు గంజాయిని పట్టుకున్నారు. సీఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం శాయంపేటకు చెందిన షేక్ రషీదా మండిబజార్ వద్ద బిక్షాటన చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. బిక్షాటనతో కుటుంబ అవసరాలు తీరడంలేదని.. సులభంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించింది. బల్లార్షా వెళ్లి అరకిలో గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చింది. చిన్న చిన్న ప్యాకెట్లు చేసి మండిబజార్ ప్రాంతంలో విక్రయిస్తోంది. బుధవారం పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు రషీదా అనుమానాస్పందంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని చూడగా గంజాయి లభించింది. నిందితురాలి నుంచి 250 గ్రాముల గంజాయి, రూ.3వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అరెస్టు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ శివకుమార్ తెలిపారు. గంజాయి విక్రయించిన వారిపై సేవించిన వారిపై కేసులు పెడతామని ఆయన హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న మాల మహానాడు, అంబేద్కర్ సంఘం నేతలు

వడ్డెపల్లి, సెప్టెంబరు 11: ఎస్సీ, ఎస్టీ కులాల వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీఎస్పీ, అంబేద్కర్ సంఘం, ఆర్‌పీఐ, సమాజ్‌వాది పార్టీ, లోక్‌జనశక్తి, సమత సైనిక్‌దళ్‌తో పాటు గిరిజన పార్లమెంటు సభ్యులు చేస్తున్న దర్నాకు సంఘీభావంగా బుధవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు, అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేశారు.

ఈ సందర్భంగా మన్నె బాబురావు, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామితో పాటు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దావ రవి, జిల్లా ఉపాధ్యక్షుడు పనికెల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ కులాలను వర్గీ కరణ చేసేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 341ని పరిగణలోకి తీసుకోకుండా ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఎస్సీ, ఎస్టీల మధ్య విబేధాలు సృష్టించేదిగా ఉందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అంశాన్ని పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో మాల మహానాడు, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర, జిల్లా నేతలు బండి అశోక్, సింగారపు రవిప్రసాద్, బొల్లం రాం కుమార్, ఉసిల్ల ఉదయ్, గొర్రె రమేష్, సాదు కుమార స్వామి, దండ్ర శ్రీనివాస్, కొరివి అనిల్, మల్లం రాజ్‌కుమార్, నర్సయ్య, సురాసి విక్రమ్, పరశురాములు, పోతురాజు ప్రభాకర్, రామన్న, జగపతి, హరీష్, కూనమల్ల రవి, దండు రవి పాల్గొన్నారు.

మడికొండ క్వాడ్రంట్ కంపెనీలో వాక్ ఇన్ డ్రైవ్

ఐటీలో యువతకు ఉపాధి అవకాశాలు

మడికొండ, సెప్టెంబరు 11: మడికొండ ఐటీ సెజ్‌లోని క్వాడ్రంట్ ఐటీ కంపెనీలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా వాక్ ఇన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు క్వాడ్రంట్ డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022, 22, 23, 24 సంవత్సరాల్లో ఎంబీఏ, బీబీఏ, బీటెక్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈనెల 13న క్వాడ్రంట్ కంపెనీలో జరిగే వాక్ ఇన్ డ్రైవ్‌లో ఉపాధి అవకాశాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇన్సైడ్ సేల్స్, ప్రీ సేల్స్, ప్రొడక్ట్ ఆఫ్ టెక్నాలజీ సేల్స్ అవకాశాలు ఉన్నాయన్నారు. డే షిఫ్ట్‌లో వర్క్ ఉంటుందన్నారు. గుడ్ కమ్యూనికేషన్ స్కిల్స్, మార్కెటింగ్, కోల్డ్ కాలింగ్, సేల్స్ ప్రాసెస్ నాలెడ్జి, దృఢమైన లీడర్‌షిప్ స్కిల్స్ ఉన్నవారికి అవకాశాలు ఉంటాయని స్పష్టం చేశారు. ఆసక్తి గల యువత శుక్రవారం ఉదయం 10.30 గంటలకు క్వాడ్రంట్ ఐటీ సెజ్‌లో నిర్వహించే వాక్ ఇన్ డ్రైవ్‌కు హాజరుకావాలని మురళీధర్ రెడ్డి కోరారు.

మావోయిస్టు దళ సభ్యురాలి లొంగుబాటు



మావోయిస్టు లొంగుబాటును చూపుతున్న ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు11: మావోయిస్టు పార్టీ దళ సభ్యురాలు ములుగు జిల్లా ఏటూరునాగారం పోలీసులు ఎదుట బుధవారం రాత్రి లొంగిపోయింది. ఏటూరు నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ విలేకరుల సమావేశంలో ఈ మేరకు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం పూజారి కాంకేర్ ఏరియా దళ సభ్యురాలు (ఏసీఎం) పోడియం సోమిడి అలియాస్ రోని మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు నచ్చక పార్టీ నుంచి బయటకు వచ్చి లొంగిపోయిందని తెలిపారు. పూజారి కాంకేర్ ఆర్‌పీసీ కమాండర్ కుర్సం సమ్మయ్య అలి యాస్ సమ్మన్న ప్రోద్బలంతో సోమిడి 2019లో మావోయిస్టు పార్టీ మిలీషియా సభ్యురాలిగా చేరిందన్నారు. ఆ తర్వాత ఆయన దగ్గర ఆరు నెలలు పనిచేసిందని, అనంతరం రెండో సెంట్రల్ రీజినల్ కమాండర్ దొడ్డి పోజ్జ అలియాస్ ప్రకాశ్ ఆమెకు పార్టీ సభ్యురాలిగా పదోన్నతి కల్పించాడని వివరిం చారు. అక్కడ ఆమె దళకమాండర్ సాగర్‌కు గార్డుగా యేడాది పాటు పనిచేసిందని, ఆ తర్వాత సెంట్రల్ రీజినల్ ఒకటో ప్లాటూన్‌లో చేరిందని వివరిచారు. 2023లో ఆమె ఏరియా కమిటీ సభ్యురాలుగా హోదా పొందిందన్నారు. సోమిడిపై రూ.4 లక్షల రివార్డ్ ఉందని ఏఎస్పీ తెలిపారు. ఆయా హోదాల్లో పనిచేసి నపుడు పలు హింసాత్మక సంఘట నలు సహా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కర్రె గుట్టల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆమె పాల్గొందని తెలిపారు. ఆ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారని అన్నారు. అదేవిధంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం జగురగొండ పీఎస్ పరిధిలోని కుందేర్ గ్రామంలో ముగ్గురు సీఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లను కాల్చి చంపిన సంఘటనలో సోమిడి పాల్గొందని ఏఎస్పీ తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ధర్మారం క్యాంపుపై జరిగిన దాడిలో ఆమె పాల్గొంద న్నారు. అదే రాష్ట్రం పెద్దబట్టుంలోని కవురగుట్టలో జరిగిన పోలీసుల కాల్పుల్లో తప్పించుకుందని వివరించారు. మావోయిస్టు పార్టీ భావజాలంపై విరక్తితో సోమిడి బయటకు వచ్చిందన్నారు.

మావోయిస్టులు ప్రజల వద్ద డబ్బులు వసూలు చేసి ముఖ్య నేతలకు పంచే విధానం నచ్చక ఆమె పార్టీని వీడి జన జీవన స్రవంతి కలుస్తోందని ఏఎస్పీ తెలిపారు.



ఇన్నర్ రింగ్‌రోడ్డు సర్వేను అడ్డుకున్న రైతులు

పోచమ్మమైదాన్, సెప్టెంబరు 11: వరంగల్ మండల పరిధి లోని పైడిపెల్లి రెవెన్యూ విలేజ్‌లో ఇన్నర్ రింగ్‌రోడ్డు కోసం నిర్వహిస్తున్న సర్వేను స్థానిక రైతులు అడ్డుకున్నారు. బుధవారం మండల సర్వేయర్ సందీప్‌కుమార్ సర్వే చేస్తుండగా పైడిపెల్లి, ఆరెపల్లి గ్రామాలకు చెందిన రైతులు వచ్చి సర్వేను నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు మాట్లాడుతూ తమకు సమాచారం లేకుండా సర్వే నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు కోసం భూములివ్వబోమని అన్నారు. అధికారులు తమకు తెలియకుండా సర్వే చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో నాగరాజు, రాంరెడ్డి, దినేష్, జితేందర్, రవి, రాజేందర్, అమర్, శ్రీను, రాజేశ్వర్‌రావు, శివ, సాయిరాం పాల్గొన్నారు.



ఇన్నర్ రింగ్‌రోడ్డు సర్వే వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

భద్రకాళి అమ్మవారి ఒడిబియ్యం వేలం

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 11: వరంగల్‌లోని చారిత్రక భద్రకాళి దేవాలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన ఒడిబియ్యానికి బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. గత ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 10వ తేదీ వరకు ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన ఒడిబియ్యం 65 క్వింటాళ్లు ఉన్నాయి. ఈ బియ్యాన్ని దేవాదాయ శాఖ పరిశీలకులు సంజీవరెడ్డి, ఆలయ ఈవో, సహాయ కమిషనర్ శేషుభారతి, ప్రధా నార్చకులు భద్రకాళి శేషు భక్తుల సమక్షంలో వేలం పాట నిర్వహించారు. ఇందులో ముగ్గురు టెండర్‌దారులు పాల్గొనగా గుండా రమేష్ అనే వ్యక్తి రూ.1.05 లక్షలకు కైవసం చేసుకున్నాడు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

▸▸ రాజ్యసభ మాజీ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు

నర్సంపేట, సెప్టెంబరు 11: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్ పిలుపునిచ్చారు. నర్సంపేట పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ స్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వారు కార్యకర్తలతో కలిసి ప్రారంభించారు. సభ్యత్వ నమోదును చురుకుగా నిర్వహించి నియోజకవర్గం ముందంజలో ఉండేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, బీజేపీ నాయకులు కాళీప్రసాద్, కంభంపాటి పుల్లారావు, నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహారావు, జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బానోతు వీరన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మీర శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి మల్యాల వినయ్‌కుమార్, కౌన్సిలర్లు జుర్రు రాజు, బోడ గోల్యా నాయక్, నియోజకవర్గంలోని మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 26 మందికి జరిమానా

మట్టెవాడ, సెప్టెంబరు 11 : మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 26మందికి జరిమానా, ఒక వాహనదారుడికి జైలుశిక్షను బుధవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ 26 మందికి రూ. 39,400 జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఏడుగురు వ్యక్తులకు రూ.8,500 జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

మత్తు పదార్థాల నివారణకు సహకరించాలి

మట్టెవాడ, సెప్టెంబరు 11 : గంజాయి, ఇతర మత్తు పదార్థాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ తుమ్మ గోపి అన్నారు. బుధవారం వరంగల్ మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మట్టెవాడ పోలీసుల ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగం, నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. మట్టెవాడ సీఐ గోపి మాట్లాడుతూ నేటి సమాజంలో గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోయిందని చెప్పారు. దీని ప్రభావం విద్యార్థులపై పడకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కె.అరుణ, ఉపాధ్యాయులు ఓడపల్లి అజయ్‌బాబు, దేవులపల్లి కిరణ్ కుమార్, ప్రభాకర్, షౌకత్ అలీ, సుదర్శన్, విద్యార్థులు పాల్గొన్నారు.

మానుకోట జిల్లాలో కేంద్ర బృందం పర్యటన

▸▸ జరిగిన నష్టాన్ని సభ్యులకు తెలిపిన బాధితులు

మరిపెడ, సెప్టెంబరు 11: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో కేంద్ర బృందాలు పర్యటించాయి. పది రోజుల కిందట భారీ వర్షాలకు వరదముంపునకు గురై నష్టపోయిన పంటపొలాలను, జలదిగ్బంధానికి గురైన ఇళ్లను, తెగిన రోడ్లను, కుంటలు, చెరువులను ఆరుగురు సభ్యులు ఉన్న కేంద్ర బృందం రెండుగా విడిపోయి క్షుణ్ణంగా బుధవారం రాత్రి పరిశీలించారు. తొలుత మరిపెడ మండలం ఉల్లేపల్లిలో జలదిగ్బంధానికి గురైన ఇళ్ల బాధితుల వద్దకు వెళ్లి వారికి జరిగిన నష్టాన్ని పరిశీలిస్తూ, బాధితులు చెప్పిన అన్ని విషయాలను వింటూ సహాయక చర్యలపై కేంద్ర బృందం ఆరా తీసింది. అనంతరం ఉల్లేపల్లిలో వరద ఉధృతి, జరిగిన నష్టంపై అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. సీతారాంతండాలో కేంద్ర బృందం పర్యటించగా అక్కడ జల దిగ్బంధానికి గురైన ఇళ్లను చూసి అవాక్కయ్యారు. మరో కేంద్ర బృందం అబ్బాయిపాలెం, గాలివారిగూడెం, పురుషోత్తమయగూడెం రోడ్డు డ్యామేజీలను పరిశీలించారు.

● డోర్నకల్: డోర్నకల్ మండలం ముల్కలపల్లిలో బుధవారం రాత్రి కేంద్ర బృందం దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. ముల్కలపల్లిలోని ఎస్టీ కాలనీని సందర్శించి బాధితులతో మాట్లాడారు. కొట్టుకుపోయిన హైలెవల్ వంతెనను పరిశీలించారు.

వైభవంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 11 : నగరంలో గణనాయకుడు వినాయకుడి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం పలు మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు, అన్నదానాలు చేశారు. రామన్నపేటలోని గాంధీ విగ్రహం సెంటర్, పాపయ్యపేట చమన్ రేకులపెల్లి వాడలో అన్నదానం నిర్వహించారు. పాపయ్యపేటలో ఏర్పాటు చేసిన పసుపుకొమ్ముల వినాయకుడు, కృష్ణాకాలనీలో నాగుపాముల అలంకరణలో వినాయకుడు, కొండూరు వారి వీధిలోని మార్వాడీ పాఠశాలలో ఏర్పాటు చేసిన వినాయకుడు, భద్రకాళి దేవాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని భక్తులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలు బుధవారానికి 5వ రోజుకు చేరుకోగా గణపతులను భక్తులు దర్శించుకున్నారు.

● పోచమ్మమైదాన్: మూడవ డివిజన్ పైడిపెల్లిలోని బొడ్రాయి వీధిలో ఇండియన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతి మండపం వద్ద మహా అన్నదానం ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ జన్ను షిభారాణి, కాంగ్రెస్ నాయకుడు జన్ను అనిల్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేసి మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ లింగం కోటిలింగం, అన్నదాతలు పెరుమాండ్ల సుమలత-రాజుగౌడ్, కల్పన-నరేష్, యూత్‌సభ్యులు బండారి తిరుపతి, బోయిని యాకయ్య, నరెడ్లమురళి, కన్నెబోయిన నాగరాజు, బోయిని రాజేష్, బైరోని వరుణ్, బుస్స రాకేష్, బొల్లం లక్ష్మణ్, కన్నెబోయిన నరేష్, బండారి కరుణాకర్ పాల్గొన్నారు.మూడవ డివిజన్‌లో శ్రీగణేష్ నవయువ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద మహా అన్నదానం చేశారు. స్థానిక కార్పొరేటర్ జన్ను షిభారాణిఅనిల్ ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

● ఖిలావరంగల్: నగరంలోని పెరకవాడలో రిటైర్డు ఎక్సైజ్ సీఐ దిడ్డి నరేందర్ అన్నదానం చేశారు. శ్రీహనుమాన్ నవయువత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మండపాల వద్ద పూజలు, అన్నదానాలు



నగరంలోని పాపయ్యపేటలో భక్తులకు దర్శనమిస్తున్న పసుపుకొమ్ముల వినాయకుడు

● కాశిబుగ్గ: నగరంలోని గాంధీనగర్‌లో గణపతి నవరాత్రుల్లో భాగంగా శ్రీపోచమ్మ యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్, ఈటల ఉమామహేందర్ పాల్గొన్నారు. అలాగే ఓ సిటీలోని క్లాసిక్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

● శంభునిపేట: నగరంలోని రంగశాయిపేట మహంకాళి వీధిలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కేడల పద్మజనార్దన్, విలాసాగరం, విశ్వనాథం, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే జయశంకర్ కాలనీలో ఏర్పాటు చేసిన మండపం వద్ద కుంకుమ పూజ నిర్వహించి అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, ఉపాధ్యక్షుడు సిద్దం నరేష్, కాలనీ పెద్దలు బుర్ర మధుకర్, కంభంపాటి రాజు, పి.రవి, అడ్డూరి రమేష్‌బాబు, జంజాల అమర్‌నాథ్, దొమ్మాటి నగేష్, బుర్ర స్వప్న, కంభంపాటి అనురాధ, బుస్సు ఈశ్వరి పాల్గొన్నారు. విశ్వబ్రాహ్మణ వీధిలోని మండపం వద్ద శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్రను సాంస్కృతిక కళాకారులు బుర్ర కథ రూపంలో చెబుతున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై బుర్రకథను విన్నారు.



రంగశాయిపేటలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కథ చెబుతున్న కళాకారులు

● గిర్మాజీపేట: వరంగల్‌లోని ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రిలో గణపతి నవరాత్రి పూజలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల హౌజ్ సర్జన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మాదిరిగానే గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. బుధవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన విశేష పూజల్లో వైద్య కళాశాల అధ్యాపకులు, ఆస్పత్రి వైద్యాధికారులు, హౌస్ సర్జన్‌లు, వైద్య విద్యార్థులు, సిబ్బంది, రోగులు, వారి సహాయకులు పాల్గొన్నారు.

ఈ పూజల్లో అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ విజయ గణేష్ రెడ్డి, డాక్టర్ దుర్గాబాయి, డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ నాగలక్ష్మి, డాక్టర్ ఎన్.శ్రీధర్, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ శిరీష, డాక్టర్ శ్వేత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ మధు, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ ఆర్.జ్యోతి ఆస్పత్రి వైద్యాధికారులు డాక్టర్ జగన్మోహనాచారి, డాక్టర్ వసంత, డాక్టర్ ఈశ్వర్, డాక్టర్ హరికృష్ణ, హౌస్ సర్జన్స్ అసోసియేషన్ నాయకులు సంజీవన్, మల్లేష్, నాగరాజు, నవ్య, మానస పాల్గొన్నారు. ఈ గణపతిని గురువారం నిమజ్జనం చేయనున్నట్లు వారు తెలిపారు.



వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో గణపతి పూజలో వైద్యులు



పైడిపెల్లిలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ జన్ను షిభారాణిఅనిల్



ఓ సిటీలోని క్లాసిక్ రెసిడెన్సీలో పూజలో పాల్గొన్న మహిళలు



పెరకవాడలో అన్నదానం చేస్తున్న రిటైర్డు ఎక్సైజ్ సీఐ దిడ్డి నరేందర్

రంగనాథస్వామి దేవాలయానికి విరాళం

కాశిబుగ్గ, సెప్టెంబరు 11: నగరంలోని కాశిబుగ్గలో ప్రసిద్ధి గాంచిన శ్రీ రంగనాథస్వామి దేవాలయం అభివృద్ధి కోసం కాశిబుగ్గకు చెందిన గడ్డం సదానందం రూ.లక్ష విరాళం బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ కోశాధికారి సుల్తానా సమ్మక్క, ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, కూరపాటి రోజ, గడ్డం భాస్కర్, దూడం రాజనారాయణ పాల్గొన్నారు.



విరాళం ఇచ్చిన సదానందంతో కమిటీ సభ్యులు

నాలుగు లేబర్ కోడ్స్‌ను వెనక్కి తీసుకోవాలి : ఐఎఫ్‌టీయూ

కాశిబుగ్గ, సెప్టెంబరు 11: కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన నేర చట్టాలను, నాలుగు లేబర్ కోడ్స్‌ను వెనక్కి తీసుకోవాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.అనురాధ, ఎం.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని కాశిబుగ్గలో బుధవారం జరిగిన కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. వివిధ ప్రభుత్వాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, అసంఘటిత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25వరకు వివిధ రకాల ఆందోళనలు చేపడుతామని పేర్కొన్నారు. 30న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. నూతన చట్టాలను నిరాహార దీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు చేస్తే జైలుకు పంపించేలా రూపొందించారని జిల్లా ప్రధాన కార్యదర్శి గంగుల దయాకర్ ధ్వజమెత్తారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీతారామయ్య, శ్రీధర్, జి. నాగరాజు, శివబాబు, రామన్న, రాజేందర్ పాల్గొన్నారు.

ఎర్ర జెండా నీడలోనే సాయుధ రైతాంగ పోరాటం

▸▸ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు

▸▸ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ప్రారంభం

శంభునిపేట, సెప్టెంబరు 11: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఎర్రజెండా నీడలోనే జరిగిందని, పోరాటానికి సంబంధించిన సర్వ హక్కులు సీపీఐకే దక్కుతాయని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు బుధవారం నగరంలోని బొల్లికుంట సీపీఐ కాలనీ అంబేద్కర్‌నగర్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. సీపీఐ ఖిలావరంగల్ మండల కార్యదర్శి దండు లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిజాం పాలనలో ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేదని, రజాకార్లు చెలరేగి ప్రజల్ని హింసించేవారని అన్నారు. ఈక్రమంలో ఆంధ్ర మహాసభ ఏర్పడి వీరోచిత పోరాటాలను చేసిందన్నారు. పేదలకు 10 లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర సీపీఐదేనని అన్నారు. ప్రపంచంలో ఇంత పెద్ద ఎత్తున పేదలకు భూమి పంచిన చరిత్ర లేదన్నారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, సోయబుల్లాఖాన్ వంటి అనేక మంది పోరాటం ఫలితంగా హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడం జరిగిందని పేర్కొన్నారు.

సాయుధ పోరాటం హిందువులకు వ్యతిరేకంగా జరిగిందని బీజేపీ దొంగ మాటలు చెబుతుందని శ్రీనివాస్‌రావు అన్నారు. సాయుధ పోరాటంలో పాల్గొన్న బందగీ, సోయబుల్లాఖాన్ లాంటి వారు ముస్లింలేనని శ్రీనివాసరావు గుర్తుచేశారు. అసలు నాడు బీజేపీనే లేదని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీల కోసం పనిచేసే బీజేపీ పేదలకు చేసిందేమీ లేదన్నారు. కార్పొరేట్ కంపెనీలకు వేలాది ఎకరాలు పంచారే తప్ప పేదలకు ఎక్కడైనా గుంట స్థలం ఇచ్చారా.. అని ప్రశ్నించారు. మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి ఓట్ల రాజకీయం చేయడం తప్ప బీజేపీ చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. అనంతరం సాయుధ పోరాట అమరవీరుల స్థూపం వద్ద సీపీఐ నాయకులతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పంజాల రమేష్, జిల్లా నాయకులు ఎస్‌కే భాషామియా, గన్నారపు రమేష్, బుస్సా రవీందర్, దామెర కృష్ణ, ఓర్సు రాజు, ఎమ్డీ. అక్బర్ పాషా, ల్యాదెళ్ల శరత్, సుంకరి భవాని, చిట్యాల సువర్ణ, చిరంజీవి, జన్ను రాజు, శంషుద్దీన్, వనం సౌందర్య, ప్రభాకర్, రమేష్, ఎడ్ల రాజు, శ్రీను, కిరణ్, కరుణాకర్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న తక్కళ్ళపల్లి శ్రీనివాస్‌రావు

సమయం లేదు మత్స్యమా!

(5వ పేజీ తరువాయి)

కొనుగోలు చేసేందుకు వీలుగా నగదు బదిలీ పథకాన్ని అమలు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని మత్స్యకారులు అభిప్రాయపడుతున్నారు.

పంపిణీలో అవినీతి

ఉమ్మడి జిల్లాలో గతంలో ఉచిత చేప పిల్లల పంపిణీలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలున్నాయి. టెండర్లు దక్కించుకున్న సరఫరాదారులు బరువు, సైజు తక్కువ ఉన్న పిల్లలను తేవడంతో చేపల్లో ఎదుగుదల లేక నష్టాలు ఎదుర్కొన్నామని మత్స్యకార సంఘాల నాయకులు వాపోయారు. కాంట్రాక్టర్లు చెప్పిన లెక్కలకు, ప్యాకెట్‌లో ఉండే చేపపిల్లల సంఖ్యకు పొంతనఉండడం లేదంటున్నారు. పైగా ఎక్కువగా ఆంధ్ర ప్రాంతం నుంచి దిగుమతి చేసుకున్న చేపపిల్లలనే పంపిణీ చేశారని చెప్పారు. దీనివల్ల ఇక్కడి వాతావరణం సరిపడక చాలా చేపపిల్లలు ఎదుగుదల లేకుండానే చనిపోయాయని చెప్పారు. ఈ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈఏడాది చేపపిల్లల సరఫరాదారులతో నిబంధనల ప్రకారం ఒప్పందం కుదుర్చుకొని స్థానికంగా ఉత్పత్తి చేసిన చేపపిల్లలనే పంపిణీచేసేలా చూడాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

శంభునిపేట, సెప్టెంబరు 11: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నగరంలోని రంగశాయిపేట టీచర్స్‌కాలనీలో జరిగింది. మామునూరు సీఐ రవికుమార్ తెలిపిన ప్రకారం... రంగశాయిపేట రుద్రమనగర్ ప్రాంతానికి చెందిన తాళ్లూరి అప్పయ్యచారి(55) వడ్రంగి పని చేస్తుండేవాడు. అప్పయ్యచారి మద్యానికి బానిస కాగా, ఈనెల 7న తాగి రావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. రాత్రి ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. కుమారుడు ఉదయ్‌కుమార్, భార్య సరోజన వెతికినా ఆచూకీ లభించలేదు. టీచర్స్ కాలనీలో ఉదయ్‌కుమార్‌కు ఉడ్ ఫర్నీచర్ షాపు ఉండగా, పెంపుడు కుక్కకు అన్నం పెట్టడానికి బుధవారం షాపుకు వెళ్లి చూడగా ఓ గదిలో అప్పయ్యచారి ఉరివేసుకొని చనిపోయాడు. ఈ ఘటనపై ఉదయ్‌కుమార్ స్థానికులకు, మామునూరు పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. కుమారుడు ఉదయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవికుమార్ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

మట్టెవాడ, సెప్టెంబరు 11: వరంగల్ హంటర్‌రోడ్‌లో ఐరన్ షాపు షెట్టర్లను పగలగొట్టి డబ్బులు దొంగిలించిన కేసులో బుధవారం నిందితుడిని అరెస్టు చేసినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గత జూలై 27న రాత్రి సమయంలో వరంగల్ హంటర్‌రోడ్‌లోని జగదాంబ, దుర్గా, కనకదుర్గా ఐరన్ షాపుల షట్టర్ల తాళాలను పగలగొట్టి కౌంటర్లలో ఉన్న డబ్బులను హైదరాబాద్ చంద్రాయణగుట్టకు చెందిన జువ్వనూరు బసవరాజు అలియాస్ సలీం, రాంబాబుతోపాటు మరో ఇద్దరు అపహరించారని తెలిపారు. సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించి బుధవారం ప్రధాన నిందితుడు జువ్వనూరు బసవరాజును హంటర్‌రోడ్‌లో అరెస్టు చేసినట్లు చెప్పారు. షట్టర్ తాళాలు పగులగొట్టేందుకు ఉపయోగించిన గడ్డపార, స్క్రూ డ్రైవర్‌ను స్వాధీనపర్చుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ గోపి తెలిపారు. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు.

రీసెర్చ్ ఫెల్లోషిప్ పరీక్షలో జాతీయ స్థాయిలో హర్షితకు రెండో ర్యాంకు

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 11 : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థినులు వెల్ది హర్షిత భారతీయ కృషి అనుసంధాన పరిషత్(ఐసీఏఆర్) నిర్వహించిన జూనియర్ రీసెర్చ్ ఫెల్లోషిప్ పరీక్షలో జాతీయ స్థాయిలో రెండో ర్యాంకును వాటర్ సైన్స్ ప్లస్ టెక్నాలజీ విభాగంలో సాధించింది. అదేవిధంగా పూర్వపు విద్యార్థిని బండేవాలి శ్వేత సీనియర్ రీసెర్చ్ ఫెల్లోషిప్ పరీక్షలో జాతీయ స్థాయిలో ఆరో ర్యాంకు, ఎస్సీ కేటగిరిలో ఒకటవ ర్యాంకును వ్యవసాయ విస్తరణ విభాగంలో సాధించారు. ఈ నేపథ్యంలో బుధవారం వరంగల్‌లోని వ్యవసాయ కళాశాలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన హర్షిత, శ్వేతను కళాశాల అసోసియేట్ డీన్ బలరాం, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా డీన్ బలరాం మాట్లాడుతూ.. విద్యార్థులు సాధించిన విజయాలతో కళాశాల కీర్తి మరింత పెరుగుతుందన్నారు. వరంగల్ వ్యవసాయ కళాశాల ఇటీవల వ్యవసాయ యూనివర్సిటీలో ఉత్తమ కళాశాలగా గుర్తింపు పొందిన విషయం తెలిసిందేనని, ఇప్పుడు ఈ కళాశాల విద్యార్థినులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించడం అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హర్షిత శ్వేత

చెరువులను పరిశీలించిన సీఐ

ఖిలావరంగల్, సెప్టెంబరు 11: నగరంలోని 37, 38 డివిజన్ల పరిధి ఖిలావరంగల్‌లోని చెరువులను మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య బుధవారం పరిశీలించారు. ఖిలావరంగల్ పడమర, తూర్పుకోట వినాయక మండపాల సభ్యులు ఈనెల 16వ తేదీన వినాయకులను నిమజ్జనం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 37వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోయిని దూడయ్య, నాయకులు సిరబోయిన కిరణ్, ఇట్టబోయిన అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు గురిచేసిన ఇద్దరి అరెస్టు

వరంగల్‌సిటీ, సెప్టెంబరు 11: ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పైడిపెల్లి గ్రామానికి చెందిన రావిరాకుల స్వాతి ఇటీవల అత్తింటి వేధింపులు భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. కాగా, స్వాతి మృతిపై కేసు నమోదు చేసుకున్న ఏనుమాముల పోలీసులు నిందితులైన భర్త రావిరాకుల నిరంజన్, అత్త నిర్మలను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మామునూరు ఏసీపీ తిరుపతి తెలిపారు.

వర్ధన్నపేటలో టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు

▸▸ 480 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

వర్ధన్నపేట, సెప్టెంబరు 11 : వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆధ్వర్యంలో బుధవారం వర్ధన్నపేటలోని మహేశ్వరి రైస్ మిల్లులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.12లక్షల 48వేల విలువ గల 480 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఏసీపీ మధుసూదన్ తెలిపిన ప్రకారం... వర్ధన్నపేటలోని మహేశ్వరి రైస్ మిల్లులో పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని నిల్వ ఉంచగా దాడులు చేసినట్లు తెలిపారు. టీఎస్ 30 టీఏ 1851 మహీంద్రా మినీ వాహనంలో పీడీఎస్ బియ్యాన్ని తీసుకురాగా, వాహనాన్ని అదుపులోకి తీసుకున్నామని, డ్రైవర్ బాలు పారిపోయాడని తెలిపారు.

రైస్‌మిల్లు యజమాని కొత్త రాజును అదుపులోకి తీసుకొని మిల్లును సోదా చేయగా, రూ.12లక్షల 48వేల విలువ గల 480 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఏసీపీ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ ఎస్.రవికుమార్, ఎస్సై శరత్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

▸▸ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ వసుధ

గిర్మాజీపేట, సెప్టెంబరు 11: విద్యార్థులు కొత్త వ్యక్తులు, సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ వసుధ సూచించారు. వరంగల్‌లోని కృష్ణకాలనీ ప్రభుత్వ హైస్కూల్‌లో బుధవారం మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, చైల్డ్ వేల్ఫేర్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా నిరోధంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో వసుధ మాట్లాడారు. స్మార్ట్‌ఫోన్, సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే అపరిచితుల పరిచయాలతో తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. ఈ పరిచయాలకు ఆకర్షితులైతే జీవితాలు కోల్పోవాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం వరంగల్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకన్న మాట్లాడుతూ నూతన వ్యక్తుల పరిచయాలతో నష్టమే ఉంటుందనే విషయాన్ని విద్యార్థులు గమనించి దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా స్మార్ట్‌ఫోన్, సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయాలతో జరుగుతున్న మానవ అక్రమ రవాణాపై కూలంకషంగా వివరించారు. విద్యార్థులు ముఖ్యంగా బాలికలు తమకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా 100/1098/1930 టోల్‌ఫ్రీ నంబర్లకు వెంటనే సమాచారమిస్తే తక్షణం పోలీసు రక్షణ లభిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మధుకుమార్, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఏఎస్సైలు భాగ్యలక్ష్మి, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.



కృష్ణకాలనీ పాఠశాలలో మాట్లాడుతున్న వసుధ

తల్లిదండ్రులకు తప్పిపోయిన యువతి అప్పగింత

వర్ధన్నపేట, సెప్టెంబరు 11: మండలంలోని ఉప్పరపల్లికి తప్పిపోయి చేరిన శ్వేత (18)ను పోలీసులు విచారించి వర్ధన్నపేట పోలీసుస్టేషన్‌లో తల్లిదండ్రులకు బుధవారం అప్పగించారు. వివరాల్లోకి వెళితే... వరంగల్ నగరంలోని లేబర్ కాలనీకి చెందిన పోలెపాక ప్రసాద్, లక్ష్మి దంపతుల కుమార్తె శ్వేత నగరంలో తప్పిపోయి మండలంలోని ఉప్పరపల్లిలో ప్రత్యక్షం కావడంతో సమాచారం అందుకున్న పోలీసులు ఫసీ, హోంగార్డు ఏలియా యువతని చేరదీసి తల్లిదండ్రులకు అప్పగించారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL గురువారం 12 సెప్టెంబరు 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా..



దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లను అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి, సెప్టెంబరు 11 : ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానని పీఎస్ఆర్ ఇన్ఫ్రా కన్‌స్ట్రక్షన్ అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మైలారంలో సీతాసుందరరామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో గ్రామస్థులతో సమావేశాన్ని నిర్వహించారు. రూ.30లక్షల సొంత నిధులతో ఆలయంలో పలు అభివృద్ధి పనులను చేయించనున్నట్లు తెలిపారు. అనంతరం 16 మంది దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్లను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు లేతాకుల మధుకర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమారస్వామి, కాకన్నా, పరుపాటి రాజిరెడ్డి, ఐరెడ్డి వెంకటరెడ్డి, గబ్బెట బాబు, పిఠాపురం భిక్షపతి, కోలా అనీల్, వెంకటయ్య, సంది బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

480 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



మహేశ్వరి రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం పట్టుకున్న పోలీసు అధికారులు

వర్ధన్నపేట, సెప్టెంబరు 11 : వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశం మేరకు టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆధ్వర్యంలో బుధవారం వర్ధన్నపేటలోని మహేశ్వరి రైస్ మిల్లులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.12 లక్షల 48వేల విలువ గల 480క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం... వర్ధన్నపేటలోని మహేశ్వరి రైస్ మిల్లులో పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని నిల్వ ఉంచగా దాడులు చేసినట్లు తెలిపారు. టీఎస్ 30 టీఏ 1851 మహీంద్రా మినీ వాహనంలో పీడీఎస్ బియ్యాన్ని తీసుకురాగా, వాహనాన్ని అదుపులోకి తీసుకున్నామని డ్రైవర్ బాలు పారిపోయాడని తెలిపారు. రైస్ మిల్లు ఓనర్ కొత్త రాజును అదుపులోకి తీసుకొని మిల్లును సోదా చేయగా, రూ. 12 లక్షల 48 వేల విలువ గల 480 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. ఈ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో ఏసీపీ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ ఎస్.రవికుమార్, ఎస్సై శరత్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



కుమారస్వామి (ఫైల్)

సంగెం, సెప్టెంబరు 11 : మండలంలోని తీగరాజుపల్లిలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం జరిగింది. ఎస్సై నరేష్ తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన నల్లతీగల కుమారస్వామి(54) తాపీ మేస్త్రి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో భార్య విజయ కోడలుకు జ్వరం వచ్చిందని వారి కొడుకు విక్రమ్ ఫోన్ చేయడంతో ములుగుకు వెళ్లింది. ఇంట్లో ఒక్కడే ఉన్న కుమార స్వామి తనకు రూ.10లక్షల అప్పు ఉందని, దాన్ని తీర్చే మార్గం కానరాక పురుగుల మందు తాగి చనిపోతున్నానని డైరీలో రాసిపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక సాయం

నెక్కొండ, సెప్టెంబరు 11: నెక్కొండ హై స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న షేక్ షమీం తండ్రి అజ్మత్, 6వ తరగతి చదువుతున్న లావణ్య తండ్రి రూప్లా ఇటీవల మృతి చెందారు. కాగా, బుధవారం ఉపాధ్యాయులు ఇద్దరి కుటుంబ సభ్యులకు 50కిలోల చొప్పున బియ్యం, ఆర్థిక సాయం అందించారు. పాఠశాల హెడ్మాస్టర్ రంగారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహిస్తేనే గుర్తింపు

నెక్కొండ, సెప్టెంబరు 11 : అకింత భావంతో విధులను నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగుల గుర్తింపు ఉంటుందని మండలంలోని చంద్రుగొండ హై స్కూల్ హెడ్మాస్టర్ బి.రవికుమార్ అన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కనకం పున్నంచందర్‌ను బుధవారం పాఠశాలలో జ్ఞాపికలను అందించి శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ దయాకర్, ఉపాధ్యాయులు క్రిష్ణారావు, సునీల్, శ్రీనాధ్, మమత, సరిత, ప్రేమవాహిని, కుమార్, స్వామి, రంజిత్, విద్యార్థులు పాల్గొన్నారు.

గణపతి నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

వర్ధన్నపేట, సెప్టెంబరు 11 : గణపతి నవరాత్రుల అనంతరం వినాయక ప్రతిమలను నిమజ్జనం చేసే వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో కోనారెడ్డి చెరువును బుధవారం వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, తహసీల్దార్ విజయ్‌సాగర్, మునిసిపల్ చైర్ పర్సన్ అరుణ, కమిషనర్ జోనా, సీఐ శ్రీనివాస్‌రావు, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌లు సందర్శించారు. అక్కడ చేపట్టాల్సిన పనులపై సిబ్బందితో చర్చించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చెరువులో నీటిలోతు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి మార్కింగ్ చేయాలని ఆదేశించారు.

• రాయపర్తి : వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య అన్నారు. బుధవారం వినాయక విగ్రహాల నిమజ్జనం కొరకు మండలకేంద్రంలోని మంచినీళ్ల చెరువు, మైలారంలోని రిజర్వాయర్‌లను పరిశీలించారు. ఆయా చెరువుల వద్ద నిమజ్జనానికి సంబంధించి ఏర్పాట్లను చేపట్టాలని సిబ్బందికి సూచించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి గొడవలు, అల్లర్లు సృష్టించకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై శ్రవణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మాధన్నపేట చెరువు కట్ట భద్రమేనా!

వరుస వర్షాలతో కట్టపై ఏర్పడిన గండి
పట్టించుకోని నీటిపారుదల శాఖ అధికారులు



మాధన్నపేట కట్టపై ఏర్పడిన గండి

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 11 : కాకతీయుల కాలంలో అక్కన్న, మాధన్నలు నిర్మించిన మండలంలోని మాధన్నపేట చెరువు నీటి పారుదల శాఖ అధికారులు, పాలకుల నిర్లక్ష్యం వల్ల చెరువు అభివృద్ధికి దూరమైంది. వరుసగా కురుస్తున్న వర్షాలతో చెరువు కట్టపైనున్న రామలింగేశ్వరస్వామి ఆలయంసమీపంలో కట్టకు ఒక వైపున పెద్ద గండి ఏర్పడింది. దీంతో మాదన్నపేట కట్ట భద్రమేనా అనే అనుమానాలను రైతులు, ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.మండలంలోని మాధన్నపేట చెరువు కింద ప్రతీ ఏటా సుమారు 3,500 ఎకరాల వరి పంట సాగవుతుంది. చెరువుపై ఆధారపడి మత్స్యకారులు జీవనోపాధి పొందుతున్నారు. మాధన్న పేట చెరువు పర్యాటక ప్రాంతంగా విరాజిల్లడంతో పాటు కట్టపైనున్న రామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ప్రతీ ఏడాది చెరువుపై పంబాలో మాదిరిగా అయ్యప్పస్వామి పంబారాట్టు వేడికలు, మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. ఇంతటి చరిత్ర కలిగిన మాధన్నపేట చెరువును పాలకులు, అధికారులు పట్టించుకోక పోవడంపై ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చిత్తడిగా కట్ట దారి

కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో కట్టపైనున్న రామలింగేశ్వరస్వామి ఆలయం సమీపంలో కట్టకు ఒక భాగాన పెద్ద గండి ఏర్పడి ప్రమాదకరంగా మారింది. కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేయడం వల్ల కట్ట పొడవునా బీటలు బారుతోంది. ఇంతేకాకుండా మత్తడి ప్రాంతం నుంచి కమలాపురం రోడ్డు వరకు రెండు కిలోమీటర్ల పొడవునా కట్టదారి బురదమయమై అడుగు తీసి అడుగు పెట్టలేని పరిస్థితి ఏర్పడింది.



చిత్తడిగా మారిన కట్ట దారి

మినీ ట్యాంక్‌బండ్ కల నెరవేరేనా..?

మాధన్నపేట చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చి దిద్దుతామని 2016లో అప్పటి ప్రభుత్వం శంకుస్థాపన చేసి రాష్ట్రంలోనే అతి పెద్ద పైలాన్‌ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కట్ట అభివృద్ధి పేరుతో మంజూరైన రూ.7 కోట్లతో కట్టపై మొరం పోసి కట్టను వెడల్పు చేయడం, పూడికతీత వంటి పనులను తూతూ మంత్రం చేసి కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నాడు.

ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



నెక్కొండ పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

నెక్కొండ, సెప్టెంబరు 11 : పల్లెల్లో దోమలు, వర్షపు నీరు నిలువల కారణంగా ప్రమాదకరమైన డెంగ్యూ, చికున్ గునియా, మెదడువాపు వంటి అనేక రకాల వ్యాధులు ప్రభలుతున్నాయని, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు చికిత్సలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. బుధవారం నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను తనిఖీ చేయడంతో పాటు రోగులకు వైద్య సేవలను అందించారు. ఆస్పత్రిలో మందుల నిలువలను పరిశీలించిన అనంతరం రోగులకు అవసరమైన మందులు వెంటనే పంపిస్తామన్నారు. దోమల కారణంగా రకరకాల జ్వరాలు ప్రభలుతున్నాయని, ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్య సిబ్బందికి ఆదేశాలను జారీ చేశారు. ఇండ్ల అవరణల్లో, వీధుల్లో నీటి నిలువలు లేకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గిరిజన తండాల్లో వారం వారం వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రహేలాతన్వీర్, సిబ్బంది అనిల్ కుమార్, వరమ్మ, సంజీవ్, రవీచంద్రరెడ్డి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

• చెన్నారావుపేట: వైద్య సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండా లని డీఎంహెచ్‌వో వెంకటరమణ అన్నారు. మండలం కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో పర్యటిస్తూ జ్వర పీడుతులను గుర్తించాలన్నారు. ఇంటింటికి సర్వే చేపట్టాలన్నారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సరోజ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

• నల్లబెల్లి : వర్షాకాలం సీజనల్ వ్యాధులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని నల్లబెల్లి పీహెచ్‌సీ వైద్యుడు రవీందర్ తెలిపారు. మండలంలోని రేలకుంట, నందిగామ గ్రామాల సబ్ సెంటర్లలో మెడికల్ క్యాంపును నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



విద్యుత్ మీటర్ల రశీదులను అందిస్తున్న మధుసూదన్‌రావు

పర్వతగిరి, సెప్టెంబరు 11 : విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ మధుసూదన్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని పెద్దతండాలో వినియోగదారులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తండాల్లో విద్యుత్ మీటర్లు లేకుండా విద్యుత్ వినియోగిస్తున్న తండా వాసులకు అవగాహన కల్పించి 50విద్యుత్ మీటర్లకు దరఖాస్తులు స్వీకరించి రశీదులు అందించారు. ఎస్సీ కాలనీలు, తండాల్లో విద్యుత్ మీటర్లు లేనివారికి రూ.950 చెల్లిస్తే అక్కడికక్కడే రశీదులు ఇస్తారని, 200 యూనిట్ల వరకు గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ అకౌంట్స్ అధికారి సంజీవరావు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, పర్వతగిరి ఏడీఈ చంద్రమౌళి, అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది కిషన్, రవినాయక్, బీక్యా, శ్రవణ్, పూర్ణాచారి, అనిల్ పాల్గొన్నారు.

టీజేఎస్ బలోపేతానికి కృషి చేయాలి

నర్సంపేట, సెప్టెంబరు 11: తెలంగాణ జన సమితి పార్టీ బలోపేతానికి పార్టీ నాయ కులు, కార్యకర్తలు కృషి చేయాలని టీజేఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.జావిద్ పిలుపు నిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ సభ్యత్వనమోదు కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యపరిరక్షణ, సామాజికన్యాయం సాధనే టీజెఎస్ లక్ష్యమని ఆయనఅన్నారు. విలువలతో కూడిన రాజకీయపార్టీని ప్రొఫేసర్ కోదండరాం ఏర్పాటు చేశారన్నారు. పార్టీ సభ్యత్వనమోదును విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర నాయకుడు గుంటి రాంచందర్, బొనగాని రవీందర్, నాయకులు ఎలిశాల రాజేశ్, సాంబరాతిమల్లేషం, సోల్తి సాయికుమార్, ఎండి.సంధాని, దోమరమేశ్, గుంటి సంజీవ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

చెన్నారావుపేట, సెప్టెంబరు 11 : మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన కామగాని వర్షిత అనే విద్యార్థిని ఖో- ఖోలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం జయ బుధవారం తెలిపారు. పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న వర్షిత ఇటీవల హన్మకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఖో- ఖో పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చి సబ్ జూనియర్ విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైందన్నారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో హైదరబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

• దుగ్గొండి : ఈ నెల 10న ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రీడల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించగా మండల కేంద్రంలోని ఆదర్శవాణి ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. 60 మీటర్లరన్‌లో అండర్ 14విభాగంలో ఎ.సాయితేజ పాల్గొని బంగారు పతకం, పి.శివ అండర్ 8విభాగంలో పాల్గొని బ్రాడ్ జంప్‌లో బంగారు పతకం, పి.సుసన్న జావలిన్‌త్రోలో రజత పతకం, టి. భాను ప్రసాద్ కాంస్య పతకం, 100మీటర్స్‌లో సాయిచరణ్ బ్రాంచ్ మెడల్‌లు సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని విద్యాసంస్థల చైర్మన్ నాగనబోయిన రవి వెల్లడించారు.

• పర్వతగిరి : జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో ఆర్‌డీఎఫ్ రోళ్లకల్లు పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు హెచ్ఎం రాములు తెలిపారు. బాలి కల అండర్-12 విభాగంలో ఏడవ తరగతికి చెందిన ఎస్‌కె.షైమన్ లాంగ్‌జంప్‌లో బంగారు పతకం, రన్నింగ్‌లో రజత పతకం సాధించాడు. పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు.

మానుకోట జిల్లాలో కేంద్ర బృందం పర్యటన

• జరిగిన నష్టాన్ని సభ్యులకు తెలిపిన బాధితులు

మరిపెడ(మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 11 : మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో కేంద్రబృందాలు పర్యటించాయి. పదిరోజుల కిందట భారీ వర్షాలకు వరదముంపునకు గురై నష్టపోయిన పంటపొలాలను, జలదిగ్బంధానికి గురైన ఇళ్లను, తెగినరోడ్లను, కుంటలు, చెరువులను ఆరుగురు సభ్యులు ఉన్న కేంద్రబృందం రెండుగా విడిపోయి క్షుణ్ణంగా బుధవారం రాత్రి పరిశీలించారు. తొలుత మరిపెడ మండలం ఉల్లేపల్లిలో జలదిగ్బంధానికి గురైన ఇళ్ల బాధితుల వద్దకు వెళ్లి వారికి జరిగిన నష్టాన్ని పరిశీలిస్తూ, బాధితులు చెప్పిన అన్ని విషయాలను వింటూ సహాయక చర్యలపై కేంద్రబృందం ఆరా తీసింది. అనంతరం ఉల్లేపల్లిలో వరద ఉధృతి, జరిగిన నష్టంపై అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. సీతారాంతండాలో కేంద్ర బృందం పర్యటించగా అక్కడ జలదిగ్బంధానికి గురైన ఇళ్లను చూసి అవాక్కయ్యారు. మరో కేంద్ర బృందం అబ్బాయిపాలెం, గాలివారిగూడెం, పురుషోత్తమయగూడెం రోడ్డు డ్యామేజీలను పరిశీలించారు. వీరికి అర్‌అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఇంజనీర్లు నష్ట అంచనాలను వివరించారు. కేంద్ర తనిఖీ బృం దంలో కల్నల్ కెపి.సింగ్, మహేష్‌కుమార్, శాంతినాథ్ శివప్ప కాగి, ఎస్‌కె కుష్వాహ, టి.నిలయకన్నన్, డాక్టర్ శశివర్థన్, రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్‌కుమార్, ఆర్‌అండ్‌బీ సీఈ నాగేందర్‌రావు, సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, అడిషనల్ కలెక్టర్ డేవిడ్, తొర్రూరు ఆర్డీవో నరసింహారావు, తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో విజయ, అర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ముల్కలపల్లిలో..

డోర్నకల్: డోర్నకల్ మండలం ముల్కలపల్లిలో బుధవారం రాత్రి కేంద్రబృందం దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. ముల్కలపల్లిలోని ఎస్సీ కాలనీని సందర్శించి బాధితులతో మాట్లాడారు. అనంతరం వరదకు కొట్టుకుపోయిన హైలెవల్ వంతెనను పరిశీలించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. జరిగిన నష్టాన్ని నివేదిక రూపంలో కేంద్ర ప్రభుత్వానికి అందిస్తామని వారు తెలిపారు.

సమయం లేదు మత్స్యమా!

(5వ పేజీ తరువాయి)

కొనుగోలు చేసేందుకు వీలుగా నగదుబదిలీ పథకాన్ని అమలు చేస్తే ప్రయోజనకరంగాఉంటుందని మత్స్యకారులు అభిప్రాయపడుతున్నారు.

పంపిణీలో అవినీతి

ఉమ్మడి జిల్లాలో గతంలో ఉచిత చేప పిల్లల పంపిణీలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలున్నాయి.టెండర్లు దక్కించుకున్న సరఫరాదారులు బరువు, సైజు తక్కువ ఉన్న పిల్లలను తేవడంతో చేపల్లో ఎదుగుదల లేక నష్టాలు ఎదుర్కొన్నామని మత్స్యకార సంఘాల నాయకులు వాపోయారు. కాంట్రాక్టర్లు చెప్పిన లెక్కలకు, ప్యాకెట్‌లో ఉండే చేపపిల్లల సంఖ్యకు పొంతన ఉండడం లేదంటున్నారు. పైగా ఎక్కువగా ఆంధ్ర ప్రాంతం నుంచి దిగుమతి చేసుకున్న చేప పిల్లలనే పంపిణీ చేశారని చెప్పారు. దీనివల్ల ఇక్కడి వాతావరణం సరిపడక చాలా చేపపిల్లలు ఎదుగుదల లేకుండానే చనిపోయాయని చెప్పారు. ఈ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది చేపపిల్లల సరఫరాదారులతో నిబంధనల ప్రకారం ఒప్పందం కుదుర్చుకొని స్థానికంగా ఉత్పత్తి చేసిన చేప పిల్లలనే పంపిణీ చేసేలా చూడాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

నర్సంపేట, సెప్టెంబరు 11 : బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్ పిలుపునిచ్చారు. నర్సంపేట పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ స్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వారు కార్యకర్తలతో కలిసి ప్రారంభించారు. సభ్యత్వ నమోదును చురుకుగా నిర్వహించి నియోజకవర్గం ముందంజలో ఉండేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, బీజేపీ నాయకులు కాళీప్రసాద్, కంభంపాటి పుల్లారావు, నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహారావు, జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బానోతు వీరన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మీర శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి మల్యాల వినయ్‌కుమార్, కౌన్సిలర్లు జుర్రు రాజు, బోడ గోల్యానాయక్, నియోజకవర్గంలోని మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



కూల్చివేయిస్తున్న అధికారులు

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 11 : మండలంలోని కట్ర్యాల, ఉప్పరపెల్లి క్రాస్ రోడ్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన పలు కట్టడాలను తహసీల్దార్ విజయ్‌సాగర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది కూల్చివేశారు. నిర్మాణాలను బుధవారం ఎక్స్‌కవేటర్ సహాయంతో కూల్చివేశారు. గతంలో నిర్మించిన నిర్మాణాల డాక్యుమెంట్లను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

కారును ఢీకొట్టిన ట్రాక్టర్

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 11 : మండలంలోని ఇల్లంద జాతీయ రహదారిపై కారును ట్రాక్టర్ వెనకనుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు వెనకభాగం దెబ్బతినగా, ప్రయాణీకులకు ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రయాణీకుల వివరాలు తెలియాల్సి ఉంది.

ఆర్ఎంపీ, పీఎంపీలపై దాడులు ఆపాలి

దుగ్గొండి, సెప్టెంబరు 11 : గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రథమ చికిత్సలు చేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలపై వైద్యాధికారుల దాడులు ఆపాలని యూత్ ఫర్ స్వచ్ఛ్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శానబోయిన రాజ్‌కుమార్‌లు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం అయన మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రభుత్వం శిక్షణలు ఇచ్చి వైద్య సేవలు అందించే విధంగా చూడాలన్నారు. వారికి భద్రత భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

21న బిట్స్‌లో 'ఉత్సంగ్'

నర్సంపేట, సెప్టెంబరు 11 : నర్సంపేట శివారులోని బిట్స్ కళాశాలలో సెప్టెంబరు 21న ఉత్సంగ్-24 (వరంగల్ జోనల్ కాంగ్రెస్) కార్యక్రమాన్ని హైదరా బాద్‌లోని ఐఈఈఈ విద్యార్థి కార్యకలాపాల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు బిట్స్ చైర్మన్ డాక్టర్ ఎ.రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి అన్నారు. కళాశాలలో బుధవారం వాల్ పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీఎస్ హరిహరన్, డీన్ అకాడెమిక్స్ నారాయణ, ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ అడ్వయిజర్ ఎస్.సురేశ్, స్టూడెంట్ బ్రాంచ్ కౌన్సిలర్ మధుకుమార్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు తప్పిపోయిన యువతి అప్పగింత



యువతిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

వర్ధన్నపేట, సెప్టెంబర్ 11 : తప్పిపోయి ఉప్పరపల్లికిచేరిన పద్దెనిమిది ఏళ్ల యువతి శ్వేతను పోలీసులు విచారించి వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌లో తల్లి దండ్రులకు బుధవారం అప్పగించారు. వివరాల్లోకి వెళితే... వరంగల్ నగరంలోని లేబర్ కాలనీకి చెందిన పోలెపాక ప్రసాద్, లక్ష్మి దంపతుల కుమార్తె శ్వేత నగరంలో తప్పిపోయి మండలంలోని ఉప్పరపల్లిలో ప్రత్యక్షం కావడంతో, సమాచారం అందుకున్న పోలీసులు ఫనీ, హోంగార్డు ఏలియాలు యువతని చేరదీసి తల్లిదండ్రులకు అప్పగించారు.

మహేశ్వర్‌గౌడ్ నియామకంపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌గౌడ్

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 11: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా బొమ్మ మహేశ్వర్‌గౌడ్‌ను నియమించడంపై మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ హర్షం వ్యక్తంచేశారు. బుధవారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు గండి గిరి, గోపగాని వెంకట్, మద్దెల సాంబయ్య, బూర్గు రవీందర్, కట్ల సుధాకర్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూను బలోపేతం చేయాలి



విజయకుమార్ కాంతారావు

సంగెం, సెప్టెంబరు 11: మండలంలో పీఆర్‌టీయూను బలోపేతం చేసేందుకు నూతన కమిటీ కృషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. కాపులకనపర్తి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం మండల స్థాయి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పీఆర్‌టీయూకు తగిన గుర్తింపు ఉందని చెప్పారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గజ్జెల విజయకుమార్, ప్రధాన కార్యదర్శిగా బరిగెల కాంతారావు, అసోసియేట్ అధ్యక్షుడిగా పొన్నోజు సత్యమూర్తి, మహిళా ఉపాధ్యక్షురాలిగా జి.శ్రీలత, మహిళా కార్యదర్శిగా శిరీష, కార్యదర్శిగా సుతారి రవీందర్‌లను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు కల్లూరి సత్యనారాయణ, మార్త శ్రీనివాస్ తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గఫార్, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు చీకటి సమ్మయ్య నాయకులు ఎన్‌వీఆర్ రాజు, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో స్పాట్ కౌన్సెలింగ్

పర్వతగిరి, సెప్టెంబరు 11 : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల కోసం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కో-ఆర్డినేటర్ పి.అపర్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ రీజియన్‌లోని వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లోని పాఠశాలల్లో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు ఈ నెల 12వ తేదీన మడికొండలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షలు రాసి ఎస్సీ కులానికి సంబంధించి ప్రవేశం పొందలేకపోయినవారు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆ ప్రకటనలో ఆమె తెలిపారు.

బీసీ సంఘం జిల్లా ఇన్‌చార్జ్‌గా సారయ్యగౌడ్



నియామక పత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

నర్సంపేట, సెప్టెంబరు 11 : బీసీ సంఘం జిల్లా ఇన్‌చార్జ్‌గా నర్సంపేట పట్టణానికి చెందిన సోల్తి సారయ్యగౌడ్‌ను ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నియమించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో మంగళవారం సాయంత్రం ఆయన నియాక పత్రాన్ని అందజేసినట్లు బుధవారం సోల్తి సారయ్య తెలిపారు. తనపైపెట్టిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా జిల్లా బీసీ సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ పులి శ్రీనివాస్‌గౌడ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భట్టి శ్యామ్‌మాధవ్ పాల్గొన్నారు.